
0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police
station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 217 విశాఖపట్నం, 10 జూన్ 2023 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## జగన్‌కు ఉద్యోగ నేతల కృతజ్ఞతలు



ఏపీలో ఉద్యోగులు ఎప్పటినుంచో పోరాడుతున్న పలు అంశాలపై ప్రభుత్వం తాజాగా కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వైసీపీ గతంలో ఇచ్చిన హామీల మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ రద్దు, హెచ్ఆర్ఏ పెంపు వంటి నిర్ణయాల్ని కేబినెట్ ప్రకటించింది. దీంతో ఉద్యోగ సంఘాలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇవాళ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఉద్యోగ నేతలు సీఎం జగన్ ను కలిశారు.

ఇవాళ క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ తో భేటీ అయిన ఉద్యోగ సంఘాల నేతలు.. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, జీపీఎస్ ప్రకడించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. కొత్తగా జీపీఎస్ ను తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు సహా రాష్ట్ర కేబినెట్ ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.

ఈ సందర్భంగా జగన్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి ఏదైనా ఉద్యోగులకు చేస్తామని జగన్

(మిగతా 2లో)

### ఆదివారం సాయంత్రం రైల్వేగ్రౌండ్స్‌లో

## అమిత్‌షా బహిరంగ సభ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏపిలో ఏర్పాటు చేసిన సంపర్క అభియాన్ కార్యక్రమంలో బాగంగా జరుగుతున్న బహిరంగ సభకు ముఖ్యఅతిధిగా వస్తున్న అమిత్ షా సభ ను జయప్రదం చేయాలని సియం రమేష్ పిలుపునిచ్చారు.

బిజెపి విశాఖ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన పత్రిక నమావేశంలో బీజేపీ ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఈనెల 11 వ తారీఖున విశాఖ నగరం రైల్వే గ్రౌండ్స్ లో సాయంత్రం 5 గంటలకు మోడీ 9 ఏళ్ల పాలన విజోత్సవాలు కార్యక్రమం జరుగుతుందన్నారు.ఆ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు అభిమానులు నాయ కులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

త్వరలోనే బిజెపి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో వస్తుందని అమిత్ షా అందరి నేతల తో భేటీ అవుతారని సీఎం రమేష్ అన్నారు.

ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,

(మిగతా 2లో)

## సింహాద్రి అప్పన్నసేవలో అక్షయపాత్ర చైర్మన్



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఆరాధ్య దైవమైన శ్రీ వరహా లక్ష్మి నరసిం హుని దర్శనం జన్మధన్యం... ఈ రోజు సాయంత్రం 4 గంటలకు సాంప్రదాయబద్ధముగా పూజ్యు లు శ్రీమాన్ మధుపండిత దాస స్వామీజీ (పద్మశ్రీ అవార్డు గ్రహీత ) - అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ మరియు ఇస్కాన్ బెంగ ళూరు అధ్యక్షులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది వీరిని గౌరవ సత్కార ములతో స్వాగతం పలికారు. దర్శనానతారం స్వామి వారి శేష

(మిగతా 2లో)

## పదవికే విరమణ - పెదవులకు కాదు : వెంకయ్య

గుంటూరు ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ఎనిమిదవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్య నాయుడు ప్రారంభించారు..

ఈ నేపథ్యంలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. యువతను మేల్కోల్పడం నాకు ఇష్టమైన పని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలతో గడపడం నాకు ఇష్టమని ఆయన పేర్కొన్నారు. పదవికి విరమణ ఇచ్చాను కానీ మాట్లాడే పెదవులకు విరమణ లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా.. విద్యావిధానాన్ని భారతీయకరణ చేయాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యువ శక్తి ఎక్కువగా ఉన్న దేశం మనదని ఆయన అన్నారు.

పురుషులతో పాటు స్త్రీ లు పోటీ ప్రపంచంలో దూసుకు వెళ్తున్నారని ఆయన కొనియాడారు. ప్రపంచంలో వస్తున్న మార్పులతో ఉపాధి అవకాశాల తో పాటు పోటీ తత్వం, సవాళ్లు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. యువత క్రమశిక్షణ, కష్టపడే తత్వం, కలుపుగోలుగా ఉండటం అలవరుచుకోవాలని ఆయన అన్నారు. పాశ్చాత్య ధోరణి మన దేశానికి, యువతకు మంచిది కాదని, భారతీయ ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఆయన అన్నారు. యోగను యువత జీవితంలో భాగం కావాలన్నారు. యోగా మతానికి సంబంధించిన అంశం కాదు ప్రపంచం ఆచరిస్తున్న ఆరోగ్య మంత్రం అని ఆయన అన్నారు..



## డాబా తోటను చూసి మురిసిన మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రతీ ఇంటిని వ్యవసాయ క్షేత్రంగా మార్చుకోవడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యాన్ని అందించే వాళ్ళు అవుతారని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం జోన్ -2 పరిధిలో 7వ వార్డులో, ఐ టైలర్స్ కోలనీలో గల జానుస్ నేచర్ మిద్దె తోటను ఆమె సందర్శించారు. 60 గజాల మిద్దె మీద అనేక రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలను పెంచుతున్న ఝాన్సీని మేయర్ హరివెంకట కుమారి అభినందించారు. ఝాన్సీని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని కొంచెం సమయం వెచ్చించి సేంద్రియ పద్ధతుల్లో ఎవరికి కావాల్సిన కూరగాయలు,పండ్లను పండిచుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ఇళ్లపైన ,కాంపౌండ్ పరిసరాల్లో మొక్కలను పెంచడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తద్వారా భావితరాలకు మంచి పర్యా వరణాన్ని అందించగలమని నగర ప్రజలు పిలుపునిచ్చారు . అనంతరం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచుతూ వాటి ద్వారా పండ్లు ,కూరగాయలను పండించడం శు భపరిణామమని అన్నారు. ప్రతీ ఒక్కరూ బంగారు ఝాన్సీని ఆదర్శంగా తీసుకొని మిద్దె తోటలను సాగు చేసుకోవాలని సూచించారు . అనంతరం జానుస్ నేచర్ ఝాన్సీ మిద్దె తోట

(మిగతా 2లో)

### హిందీ ప్రచార సభ పరీక్షలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ వారు 6వ తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతున్న మైనార్టీ విద్యార్థుల నుండి నాగరీబోర్డు, ప్రవేశ్, ప్రథమ, మధ్యమ, విశారద్, భుషాన్ మరియు విద్వాన్ హిందీ పరీక్షలు వ్రాయుటకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నారు. సెప్టెంబరు 9,10,11 తేదీలలో నిర్వహించు ఈ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఫీజును ఆగస్టు 2వ తేదీ వరకు చెల్లించవచ్చు. ఈ పరీక్షలలో భూషణ్ సంపూర్ణ పరీక్ష పాసైన వ్యక్తులు ఇండియన్ ఆర్మీలో మతానికి సంబంధించిన ఉపాధ్యాయ ఉద్యోగానికి అర్హత సాధించినట్లు అవుతుంది. విద్వాన్ పరీక్ష పాసైన అభ్యర్థులు హిందీ పండిట్ శిక్షణ, ఎంఏ హిందీ మరియు అనువాద కోర్సులు అభ్యసించడానికి అర్హులు అని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ఎం.ఏ.రహీమ్ తెలిపారు.

## మంగళగిరిలో ఐ-టీడీపీ సదస్సు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వివేకా హత్య కేసులో తప్పించాలని, కోర్టులో మేలు జరగాలని దేవాదాయశాఖ మంత్రి పూజలు చేస్తున్నారంటూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఐ-టీడీపీ సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ ఐ-టీడీపీ ఆర్గనైజేషన్ పనితీరు బాగుందని కొనియాడారు.

ఏ సందేశమైనా కార్యకర్తలకు వెంటనే చేరిపోతోందని, ఐటీడీపీ కృషివల్లే 21 లక్షల మంది సభ్యత్వం నమోదైందని ప్రశం సించారు. సమాచారాన్ని ఎవరైతే వేగంగా చేరవేస్తారో వారే విజేతలని, పార్టీ సిద్ధాం తాలను ప్రజలకు చేరవేసే విధానం మారు తోందన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ప్రకటించామని, అమ్మకు వందనం పథకం కింద రూ.1500 అందిస్తామన్నారు. దక్షిణ భారతదేశంలో జనాభా తగ్గిపోతోందని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువ ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని కల్పిస్తామన్నారు.

అలాగే సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, సంపద సృష్టించి అందరికీ ఉద్యోగాలు కల్పించిన పార్టీ తెలుగుదేశం ఒక్కటేనని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందిస్తామని, సంపదను సృష్టించడానికి పీ-4 నమూనా తీసుకువస్తామని, ప్రతి పేదవాణ్ని ధనికుణ్ని చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందన్నారు. ప్రతి మతానికి కొన్ని సంప్రదాయాలుం టాయని, వాటిని

(మిగతా 2లో)

## దేవరాపల్లిలో గడప గడవకు బూడి



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):** రానున్న 25 ఏళ్ళకు సరిపడే విధంగా మండలంలో నీటి సరఫరా వ్యవస్థ ఉండాలని, భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి మూలములన నీటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలు పరిధిలో ఉన్న 96 శివారు గ్రామాలకు 219 జల్ జీవన్ మిషన్ పనులను మూడు దఫాలుగా మంజూరు చేశామని పంచాయతీరాజ్ మంత్రి బూడి ముత్యాల తెలిపారు. దేవరాపల్లి లోని రైవాడ అతిధి గృహంలో గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో అయన మాట్లాడుతూ మూడు దశలో దేవరాపల్లి మండలానికి 51 కోట్లు రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఈ నిధులతో 96 గ్రామాలకు గాను సరిపడా మంచినీటి ట్యాంకులు, పైపు లైన్లు, బోరుబావులు ద్వారా ఇంటింటికి కుళాయి నిర్మాణం ద్వారా సుమారు 16,570 ఇళ్లకు గాను ప్రతి ఇంటికి త్రాగునీటి కుళాయిలు

(మిగతా 2లో)

## రూ. 8వేల కోట్లతో వైద్య కళాశాలల నిర్మాణం : ఎం.టీ. కృష్ణబాబు

**విజయనగరం:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలల్లో అన్ని రకాల ఆధునిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు చెప్పారు. రాష్ట్రంలో సుమారు రూ. 8వేల కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలలను దశలవారీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తొలివిడతగా నిర్మిస్తున్న విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలకు అనుగుణంగా జులై 15 నాటికే ఈ కళాశాల తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేసి, ఆగస్టు నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎపిఎం



ఎస్ఐడిసి ఎండి మురళీధరరెడ్డి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర అధికారులతో కలిసి, విజయనగరం గాజులరేగ వద్ద నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ, వైద్యారోగ్య రంగంలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయమని చెప్పారు. దీనిలో భాగంగా తొలివిడత ఐదు కళాశాలలను వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నామని చెప్పారు. వీటిలో నాలుగు కళాశాలలకు ఇప్పటికే అనుమతి లభించిందని, రాజమండ్రి వైద్య కళాశాలకు మాత్రం కొద్ది రోజుల్లో అనుమతులు రానున్నాయని తెలిపారు. పాడేరు, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలు 2024-25 విద్యాసంవత్సరంలో, మరో 9 వైద్య ప్రభుత్వ వైద్య కళాశాలలు 2025-26లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రతీ ఆసుపత్రికి అవసరమైన అన్ని రకాల వసతులతో పాటుగా, లక్షా, 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంగల భవన సముదాయం, 330 పడకలతో నిర్వహణలో ఉన్న ఆసుపత్రి కావాలన్నారు. కొత్తగా ప్రారంభం కానున్న ఐదు వైద్య కళాశాలల వల్ల రాష్ట్రంలో అదనంగా 750 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. సుమారు రూ.500 కోట్లతో నిర్మితమవుతున్న ఒక్కో వైద్య కళాశాలలో మొత్తం 722 మంది ఉద్యోగులను నియమిస్తామని, వీరే కాకుండా మరో 280 అదనపు సిబ్బందిని నియమించేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు.

**నిర్మాణ పనుల పరిశీలన:** విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల తరగతి గదులు, హాస్టల్ భవనం నిర్మాణ పనులను ఎం.టి.కృష్ణబాబు క్షుణ్ణంగా

(మిగతా 2లో)

# జేఎన్‌టీయూకేలో ముగిసిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** జెఎన్‌టియుకె ప్రాంగణంలో నెల రోజుల పాటు యూనివర్శిటీ గేమ్స్ & స్పోర్ట్స్ డైరెక్టరేట్ మరియు యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జెఎన్‌టియుకె టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బందికి, విద్యార్థులకు, నగర ప్రజలు, పాఠశాల విద్యార్థులకు క్రీడలు మరియు యోగా విభాగాలలో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. జెఎన్‌టియుకె ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు గారు మాట్లాడుతూ జెఎన్‌టియుకెలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాన్ని పిల్లల నుండి పెద్దల వరకు ప్రతీ ఒక్కరు సద్వినియోగపర్చుకుని శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో భాగంగా వాలీబాల్, హ్యాండ్ బాల్, ఖో-ఖో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్ విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం పెంపొందుతుందని, అదేవిధంగా యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునన్నారు.

అనంతరం ఉచిత వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులకు, నాన్ టీచింగ్ సిబ్బందికి, విద్యార్థులకు, నగర ప్రజలకు ఉపకులపతి ప్రొ.జివిఆర్. ప్రసాదరాజు గారి చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, జెఎన్‌టియుకె టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది మరియు వారి పిల్లలు, ఫిజికల్ డైరెక్టర్‌లు, నగర ప్రజలు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముంచుకొస్తున్న 'బిపర్ జోయ్' తుఫాను



అరేబియా సముద్రంలో అత్యంత తీవ్రమవుతున్న బిపర్ జోయ్ తుపాను రానున్న 36 గంటల్లో మరింత తీవ్రం కానుందని వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొంది. మరో రెండు రోజుల్లో ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తుందని ఐఎండీ ట్వీట్ చేసింది. జూన్ 08 రాత్రి 11.30 గంటలకు గోవాకిమ నైరుతి దిశలో 840 కిలోమీటర్లు, ముంబైకి పశ్చిమ నైరుతి దిశలో 870 కిలోమీటర్లు, ముంబైకి నైరుతిగా 901 కిలోమీటలర్ల దూరంలో కేంద్రీకృతమైనట్లు పేర్కొంది.

నిజానికి ఈ బిపర్ జోయ్ తుపాను తూర్పు మధ్య అరేబియా సముద్రం మీదుగా ఏర్పడి..నెమ్మది నెమ్మదిగా బలపడుతూ..రానున్న 36 గంటల్లో క్రమక్రమంగా తీవ్ర రూపం దాల్చనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తర వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉన్నట్లు ఐఎండీ ట్విట్టర్‌లో తెలిపింది. ఈ తుపాను కారణంగా దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర సహా తీర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఇదిలా ఉండగా ఈ తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. అలాగే సముద్రంలోకి వెళ్లిన వారు వెంటనే తిరిగి రావాలని హెచ్చరించడమే గాక జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేటను నిలిపేయాలని కోరింది.

పంచాంగం

శనివారం 10-06-2023
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం గ్రీష్మరుతువు
జ్యేష్ట మాసం

**తిథి : బ. సప్తమి సా. 05.44**
**నక్షత్రం : శతభిషం రా. 07.33**
**వర్జ్యం : రా. 01.34 ల 03.04**

## స్నేహం పేరుతో నమ్మించి.. బాలికపై అత్యాచారం.. సింగర్ అరెస్ట్

**పాట్నా:** నమ్మి వచ్చిన పాపానికి ఓ బాలికపై అత్యాచారం చేశాడు. అంతటితో ఆగకుండా ఆమె ఫొటోలను నెట్టింట పోస్టు చేసి చివరికి అరెస్ట్ అయ్యాడు భోజ్‌పురి గాయకుడు. నిందితుడిని బీహార్‌కు చెందిన 21 ఏళ్ల అభిషేక్‌గా గుర్తించారు. అతని యూట్యూబ్ ఛానల్‌లో 27వేల మంది ఫాలోవర్లు ఉన్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండేళ్ల క్రితం అభిషేక్ రాజీవ్ నగర్ ప్రాంతంలో నివాసముంటున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. అభిషేక్‌కు ఓ బాలికతో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. అయితే స్నేహం నెపంతో బాలికను హెూటల్ గదిలోకి రప్పించాడు. అతని నిజ స్వరూపం తెలియని బాలిక రూంలోకి వెళ్లగానే.. ఆమెపై అత్యాచారం చేయడంతో పాటు పలు అసభ్యకర ఫొటోలు తీసుకున్నాడు. ఈ ఘటన జరిగిన తర్వాత బాలిక నిందితుడికి దూరంగా ఉంటూ వచ్చింది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం నిందితుడు బాలిక ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు చూసిన అమ్మాయి కుటుంబ సభ్యులు ఆమెను ప్రశ్నించారు. దీంతో తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లిదండ్రులతో పంచుకుంది. బాలిక వాంగ్మూలాలను నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కొన్ని గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశామని పోలీసు ప్రతినిధి సుభాష్ బోకెన్ తెలిపారు. అనంతరం అతడిని సిటీ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

# నిర్మలా సీతారామన్ అల్లుడు ప్రతీక్ ఎవరు ?



దిల్లీ: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, పరకాల ప్రభాకర్ దంపతుల కుమార్తె వాఙ్మయి వివాహం వరుడు ప్రతీక్‌తో అత్యంత నిరాడంబరంగా జరిగిన విషయం తెలిసిందే. అతికొద్దిమంది కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో బెంగళూరులోని మంత్రి ఇంట్లోనే బుధవారం ఈ పెళ్లి వేడుకను పూర్తి చేశారు. రాజకీయ ప్రముఖులు, వీవీఐపీలు ఎవరూ ఈ పెళ్లి వేడుకకు హాజరుకాలేదు. పెళ్లి సమాచారాన్ని సీతారామన్ కుటుంబసభ్యులు అధికారికంగా బయటకి వెల్లడించకున్నా.. వివాహ ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో నిర్మలా సీతారామన్ అల్లుడు ప్రతీక్ ఎవరనే అంశం ఆసక్తికరంగా మారింది. ఆయన వివరాల కోసం నెటిజన్లు గూగుల్‌లో శోధించడం మొదలుపెట్టారు. ఇంతకీ ఎవరీ ప్రతీక్?ఆయనేం చేస్తుంటారు? వంటి కొన్ని విశేషాలివే..

ప్రతీక్ దోషీ.. గుజరాత్‌కు చెందిన ఈ యువకుడు ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)లో కీలక వ్యక్తిగా పనిచేస్తున్నారు. మోదీ 2014లో ప్రధాని అయినప్పటి నుంచి పీఎంవోతో ఆయనకు అనుబంధం కొనసాగుతోంది. 2019 జూన్‌లో ఆయన పీఎంవోలో జాయింట్ సెక్రటరీ ర్యాంకులో ఓఎస్‌డీ (రీసెర్చ్& స్ట్రాటజీ)గా నియమితులయ్యారు. ఒకరకంగా ప్రధానికి కళ్లు, చెవులూ తానై ప్రతీక్ వ్యవహరిస్తారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. జాతీయ పత్రికలు సైతం ప్రతీక్‌ను ఇలాగే వ్యవహరిస్తుండటం గమనార్హం. సింగపూర్ మేనేజ్‌మెంట్ స్కూల్‌లో ఎంబీఏ చేసిన ప్రతీక్.. అంతకుముందు నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో సీఎంవోలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ప్రచారానికి దూరంగా ఉండే ప్రతీక్.. సోషల్ మీడియాలోనూ అంత చురుగ్గా ఏమీ ఉండరు.

మరోవైపు, నిర్మలా సీతారామన్ కుమార్తె పరకాల వాఙ్మయి కాలమిస్ట్‌గా ఉన్నారు. దిల్లీ యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ లిటరేచర్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. అమెరికాలోని మాసాచూసాట్స్‌లోని బోస్టన్‌లో నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీలోని మిడిల్ స్కూల్ ఆఫ్ జర్నలిజం నుంచి పట్టా సాధించారు. ఆ తర్వాత ప్రముఖ వార్తా సంస్థకు ఫీచర్ రైటర్‌గా కెరీర్ కొనసాగిస్తున్నారు.

# 12న జరిగే డిఇఇ సెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**విజయనగరం:** డైట్ కాలేజీల్లో ప్రవేశాలకోసం ఈ నెల 12న జరిగే డిఇఇ సెట్‌కు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. డిఈఈ సెట్ నిర్వహణ పై తన ఛాంబర్ లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష సోమవారం ఉదయం 10 నుంచి 12.30 గంటలు మధ్య, స్థానిక అయాన్ డిజిటల్ సెంటర్‌లో జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో సుమారు 175 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

విద్యార్థుల కోసం త్రాగునీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి చేరుకొనేందుకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, పరీక్షను సజావుగా నిర్వహించాలని డిఆర్ఓ కోరారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లక్ష్మీకుమారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ దేవ్ ప్రసాద్, పోలీసు, ఆర్‌టిసి, ఎపిఇపిడిసిఎల్, వైద్యారోగ్యశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# (మొదటి పేజీ తరువాయిలు)

## జగన్‌కు ఉద్యోగ నేతల కృతజ్ఞతలు

తెలిపారు. ఉద్యోగులు అనేవారు ప్రభుత్వంలో భాగస్వాములన్నారు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని విశ్వసించిన ప్రభుత్వం మనది అని వారితో అన్నారు. మీ మనసులో కష్టం ఉండకుండా చూడాలన్నదే మా ఉద్దేశం అని వారికి వివరించారు.

అందుకే పెన్షన్ సహా కొన్ని పరిష్కారాలకోసం రెండేళ్లుగా తపనపడ్డామని జగన్ తెలిపారు.

గతంలో ఎవ్వరూ కూడా ఈ సమస్యలకు పరిష్కారం చూపించడానికి తపనపడ్డ సందర్భాలు లేవని ఉద్యోగ నేతలతో జగన్ వ్యాఖ్యానించారు. ఉద్యోగులకు పరిష్కారం దొరకాలి, అంతేకాకుండా భావితరాలను కూడా దష్టిలో ఉంచుకోవాలన్నారు. దీన్ని దష్టిలో ఉంచుకుని జీపీఎస్ తీసుకువచ్చామన్నారు. రిటైర్డ్‌ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేదిగా జీపీఎస్ ను రూపొందించామని తెలిపారు. 62 ఏళ్లకు రిటైర్‌అయితే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలని సీఎం జగన్ తెలిపారు. అందుకే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచామని సీఎం వెల్లడించారు.

ఉద్యోగులకు న్యాయం జరగాలి, మరోవైపు నడపలేని పరిస్థితులు కూడా రాకుండా ఉండాలన్నారు. సీపీఎస్లో లేనివి జీపీఎస్‌లో ఉన్నాయని, రెండేళ్ల పాటు జీపీఎస్‌పై ఆర్థికశాఖ సుదీర్ఘ కసరత్తు చేసిందని సీఎం పేర్కొన్నారు. దీని ఫలితంగానే జీపీఎస్‌ను రూపకల్పన చేశామన్నారు. కాంట్రాక్ట్‌ఉద్యోగుల క్రమబద్ధీకరణపైనా కూడా మంచి ఆలోచన చేశామన్నారు. సుప్రీంకోర్టు తీర్పులనుకూడా పరిగణలోకి తీసుకున్నట్లు జగన్ తెలిపారు. వారికి మంచి చేయాలన్న ఆలోచనతో అడుగులు ముందుకేశామన్నారు. అలాగే వైద్యవిధాన పరిషత్‌ఉద్యోగులనుకూడా ప్రభుత్వంలో విలీనం చేశామన్నారు. వారికీ మంచి పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## ఆదివారం సాయంత్రం రైల్వేగ్రౌండ్స్‌లో అమిత్‌షా బహిరంగ సభ

మాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ మాట్లాడుతూ అమిత్ షా పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని ఈ సభకు 50 వేలకు పైగా నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరవుతారని ఆయన తెలియజేసారు.అనంతరం పార్టీ ముఖ్యకార్యకర్తలతో సమావేశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమారురాజు,సెయిల్ స్వతంత్ర డైరెక్టరు కాశీవిశ్వనాథ్ రాజు, బీజేవైయం రాష్ట్ర అధ్యక్షులు సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రి అప్పన్నసేవలో అక్షయపాత్ర ఛైర్మన్

వస్త్రములు , ప్రసాదమును మరియు వేదం పండితులు ఆశీర్వచనం వీరికి అందచేశారు.

వీరి వెంట డాక్టర్ నిష్క్రించిన భక్తదాస గారు హరే కృష్ణ మూవ్మెంట్ ప్రెసిడెంట్ ,విశాఖపట్నం ,శ్రీ జయ చైతన్య ప్రభు ప్రెసిడెంట్ , మైసూర్ మరియు శ్రీ సువ్యక్త నరసింహ ప్రభు , ప్రెసిడెంట్ హరే కృష్ణ మూవ్మెంట్ ,చెన్నై . సింహాద్రి నాధుని దర్శన సేవలో పాల్గొన్నందుకు మరియు మనోహరమైన స్వామి వారి దర్శనము జరిగినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

## డాబా తోటను చూసి మురిసిన మేయర్

నిర్వహణలో తాను అవలంభిస్తున్న పూర్వీకుల నాటి సేంద్రియ పద్ధతులను మేయర్ కు వివరించారు..రసాయనిక అవశేషాలు లేని ఆకుకూరలు, కాయలు, పండ్లు పండిస్తూ తన కుటుంబ సభ్యులకు ఆరోగ్యం అందించడంతో పాటుగా సేంద్రియ వ్యవసాయం పట్ల అందరిని చైతన్యం చేస్తున్నాని అన్నారు.. తనను చూసి కొందరైన మిద్దె తోటలను సేంద్రియ విధానంలో పండిచుకొని ఆరోగ్యంగా జీవించాలని ఆశాభావం వ్యక్తం చేశారు..అనంతరం మేయర్ దంపతులు ను దుస్సాలువాతో సత్కరించి మిద్దె తోటలో కాసిన పండ్లను అందజేశారు. సేంద్రియ విధానం ద్వారా పండించిన పండ్లను రుచి చూసిన మేయర్ దంపతులు ఆనందం వ్యక్తం చేసారు . ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బంగారు ప్రకాష్,వట్టికుల నాగమ్మ ,పసుపులేటి గోపి ,నూకవరపు బాబ్జి ,బెల్లాన పాపారావు ,రాజు, ఇజ్జాడ సత్యన్నారాయణ ,దత్తి వాసు,ఆర్పీలు తెంటు మాధవి ,లావణ్య ,రూప, 67వ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో ఐ-టీడీపీ సదస్సు

దెబ్బతీసేలా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. ఆర్థిక శాఖ మంత్రి రైతుబజారును కూడా తాకట్టు పెట్టాలని ప్రయత్నిస్తున్నారని, విద్యాశాఖ మంత్రి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారని, వైసీపీలో మొత్తం జోకర్లే ఉన్నారన్నారు.

## దేవరాపల్లిలో గడప గడపకు బూడి

ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా దేవరాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో దేవరాపల్లి గ్రామానికి గాను 4.83 కోట్ల రూపాయలు మంజూరు చేసామని, అవాన గ్రామాలైన అల్లిపురం,ముత్యాలమ్మపాలెం, బంగారమ్మ పాలెం కు సుమారు 75 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో చేసిన పనుల త్వరితగతిని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు ఇందులో ఎటువంటి అలసత్వం లేకుండా ఉండడం కొరకు ప్రతి నెల మొదటి వారంలో సమీక్ష సమావేశం విధిగా నిర్వహించి పనుల పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణం , పైపు లైను నిర్మాణం ఏకధాటిన సాగాలని కాంట్రాక్ట్ లు అలసత్వం వహిస్తే విధులను వేరొకరికి మల్లిస్తామని తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థల సేకరణలు పూర్తి చేశామని మిగిలిన ప్రాంతాలలో సేకరణ చేపడుతున్నామని అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, డి.ఈ అల్లి సూర్యనారాయణ, ఏ.ఈ.చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ ఏ.ఈ.శంకర రావు పాల్గొన్నారు.

## రూ. 8వేల కోట్లతో వైద్య కళాశాలల నిర్మాణం : ఎం.టి. కృష్ణబాబు

పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కళాశాలను ప్రారంభించే నాటికి అన్ని వసతులను పూర్తిగా కల్పించాలని ఆదేశించారు. తరగతి గదుల్లో స్మార్ట్ టీచింగ్ విధానాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, రెండు చోట్ల నుంచి విద్యుత్‌ను తీసుకోవాలని సూచించారు. నీటి వసతి కోసం రూ.10కోట్లతో ప్రతిపాదించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. బోధనకు అవసరమైన అన్ని రకాల పరికరాలు, ఫర్నీచర్, ఇతర సామగ్రి అంతా ప్రారంభం నాటికే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న అత్యుత్తమ బోధనా పద్ధతులను ఈ కళాశాలలో ఏర్పాటు చేయాలని, దీనికోసం నిపుణుల బృందం ఇతర వైద్య కళాశాలలను సందర్శించి నివేదిక తయారు చేయాలని సూచించారు. విద్యుత్, ఫాల్స్ సీలింగ్, ప్లంబింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, దీనికి అవసరమైన నిపుణుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అన్ని సదుపాయాలతో హాస్టల్ భవనాన్ని నిర్మించి, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

ఈ తనిఖీలో ఎపిఎంఎస్ఐడిసి ఎండి మురళీధరరెడ్డి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, డిఎంఈ వరప్రసాద్, ఎపిఎంఎస్ఐడిసి ఎస్ఈ అంకమ్మ చౌదరి, ఇఇ బిఎన్ ప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 10 నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అక్రిడేటెడ్ జర్నలిస్టులకు శనివారం నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. కేజీహెచ్ డౌన్‌లోగల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ సెంటర్‌లో శనివారం ఉదయం 10 గంటలకు వైద్య పరీక్షలు, ఉచిత బీమా సదుపాయం (హెల్తకార్డు ఉన్న జర్నలిస్టులకు) కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని, రోజు 30 మందికి చొప్పున వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.




శ్రీ మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్
టీ.ఎఫ్.-3, బొడ్డపాటి మాన్షన్, జియాన్ బైబిల్ స్కూల్ ఎదురు,
గుణదల, విజయవాడ - 520 004.
ఫోన్ : 98852 19712, Emal: drmakkena@gmail.com

3వ సాహితీ పురస్కారాలు

ఈ ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం అందచేస్తున్న సాహితీ పురస్కారాలకై 2023 సంవత్సరానికి గాను న్యాయనిర్ణేతలు ఈ క్రింది వారిని ఎంపిక చేయడం జరిగింది. వారికి అభినందనలు

శ్రీ మక్కెన రామసుబ్బయ్య కథాపురస్కారం
"చీకటి వెన్నెల" - కథల సంపుటి
శ్రీమతి ఝాన్సీ కొప్పిశెట్టి, హైదరాబాద్

ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారం
'చంద్రశిల" - కవితా సంపుటి
శ్రీమతి స్వర్ణ శైలజ, విశాఖపట్నం

డాII కె.వి.రావు సాహితీ పురస్కారం
"దేవకాంచనం నీడన"
శ్రీమతి వసుధా రాణి, విజయవాడ

సాహితీ పురస్కారం (వ్యాసాలు/సమీక్ష/విమర్శ)
"జాషువా సాహిత్య దర్శిని"
శ్రీ గుమ్మా సాంబశివరావు, విజయవాడ

సాహితీ పురస్కారం (కవితా ప్రక్రియలు)
"మాధవ మంజరి" (గజల్ మాలిక)
శ్రీ కోరుప్రోలు మాధవరావు, హైదరాబాద్

సాహితీ పురస్కారం (బాల సాహిత్యం)
"మీను కథలు"
శ్రీమతి మంజులూరి కృష్ణకుమారి, విజయవాడ

పై పురస్కారాలను ఎంపిక కాబడ్డ వ్యక్తులకు జులై నెలలో విశాఖపట్నంలో జరుగు కార్యక్రమములో అందజేయబడతాయి.
సభా వివరాలు వ్యక్తిగతంగా తెలియజేయబడును.

- నిర్వాహక కమిటీ

# విశాఖ సమాచారమ్

శనివారం 10-06-2023


## ఇంకా ఎంతకాలం ?

ఎండలు మండిపోతున్నాయి. తాగడానికి మంచినీరు దొరకడం లేదు. ఎండలకుఎండి శరీరాలు శుష్కించిపోతున్నాయి. సూర్యుడి వేడికి శరీరతాపం పెరిగి జ్వరాలు, అనుబంధ ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అయినా జనం స్థిమితంగా ఇళ్లలో ఉండటంలేదు. రాజకీయ నాయకులు చేసే పర్యటనలలో ఉత్సాహంగానో, బలవంతంగానో పాల్గొంటున్నారు. ఈ రాజకీయ పర్యటనలు లేదా రాజకీయ మహాసభలు దేశోద్ధారణ కోసం కాదు. ఏదైనా ఒక అత్యవసర సమస్య కోసం కాదు. తమతమ రాజకీయ పార్టీల ప్రాభవాన్ని, అనుబంధాన్ని ప్రజలతో మరింతగా పెనవేసుకునేందుకు లేదా కొత్తగా ముడేసుకునేందుకు జరుగుతున్నాయి. ప్రజలకు ఇప్పుడు ఈ రాజకీయ యాత్రలతో ఎటువంటి పనీలేదు. రాజకీయ సభలతోనూ ఎటువంటి అవసరమూ లేదు. కానీ బలవంతంగా వీరంతా ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటినుండీ పాలకులు ప్రజలను తమపై ఆధారపడి జీవించే విధంగానే తీర్చిదిద్దారు. విద్యకు ఈనాటికీ ప్రాధాన్యత లేదు. వైద్యానిదీ అదే పరిస్థితి. ప్రజలు విద్య, వైద్యాన్ని పొందేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ రంగాలు రెండూ పూర్తిగా ప్రైవేటీ యాజమాన్యాల చేతిలో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. 75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో సామాన్యుడు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పాఠశాలలు, వైద్యశాలలలో హక్కు ప్రకారం కాకుండా దీనాతిదీనంగా వేడుకొని మరీ సేవలు పొందుతున్నారు. ఇక్కడ కూడా అత్యధిక చోట్ల లంచాలు తప్పడం లేదు.

ప్రభుత్వం అనేది ప్రజలకోసం ప్రజలచే ఏర్పాటు చేయబడి ప్రజలచే పరిపాలించబడటమే ప్రజాస్వామ్యం. ఇక్కడ రాజ్యాంగం ప్రకారం ప్రజలే ప్రభువులు. కానీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పెత్తనం చేస్తూ ప్రజలను మూగజీవాలుగా భావించి అరాచకం చేస్తున్నారు. ఒక ప్రజాప్రతినిధి అనగా మంత్రిగాని, శాసనసభ్యుడు గాని, ఆఖరికి గ్రామ సర్పంచ్‌గాని, ప్రజా సేవకుడు మాత్రమే అని రాజ్యాంగం నిర్వచించింది. కానీ వీరు ఏ రకంగా ప్రవర్తిస్తున్నారో అందరికీ తెలుసు. ప్రజాసేవకులు ప్రజలకు నమస్కరించవలసిందిపోయి ప్రజలువారికి నమస్కరించకపోతే వారిపై ఆగ్రహించే స్థాయిలో మన ఘనతవహించిన రాజకీయ పెద్దలు వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ అధికారులను బెదిరించి వారిద్వారా తమ కక్ష తీర్చుకుంటున్నారు.

ప్రభుత్వ అధికారులు కూడా తమకు ఒక ఉద్యోగ విధానం నిర్దేశించబడి ఉంది అనే విషయాన్ని మరచిపోయి చట్టవిరుద్ధంగా ప్రజలను హింసించేందుకు వెనుకాడటంలేదు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ అధికారులు తప్పు చేస్తే, లేదా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కన్నెర్రచేయవలసిన ప్రజలు కాళ్లు పట్టుకొని బతిమాలుకుంటున్నారు. లంచాలు, సిఫార్సులతో ఎలాగోలా పనిచేయించుకుంటున్నారు. ప్రజలను సుఖంగా ఉంచేందుకు, వారి కష్టాలు తీర్చేందుకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల పథకాలతో ముందుకు వచ్చాయి. ప్రజలు వివిధ దిగువస్థాయి అధికారుల వద్ద చేసిన విజ్ఞప్తులు కార్యరూపం దాల్చకపోతే ఉన్నతాధికారులకు విన్నవించుకునేందుకు స్పందన అనే ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ స్పందన అనే కార్యక్రమం నిర్వహించే ఉన్నతాధికారులు ప్రజలపట్ల ఎంతో బాధ్యతగానూ, వారిపట్ల ఆదరంతోనూ ఉంటే ప్రజలు సంతోషిస్తారు. అనకాపల్లిలో కొత్తగా ఏర్పడిన జిల్లా కలెక్టర్ కార్యాలయం పట్టణానికి నాలుగు కిలోమీటర్లదూరంలో కనీసం బస్సు సౌకర్యంలేని ప్రదేశంలో ఉంది. ఇక్కడికి వెళ్లాలంటే తప్పనిసరిగా అధిక ఛార్జీచెల్లించి ఆటోలో మాత్రమే వెళ్లగలరు. తీరా ఎలాగోలా వెళ్లినా ఆయా సమస్యలు వెంటవెంటనే పరిష్కారం కావడం లేదనేది ఫిర్యాదీల ఆరోపణ. పట్టణంలో ప్రభుత్వం ఆధీనంలో కొన్ని ప్రాంగణాలు ఇటువంటి కార్యక్రమాలకు అనుగుణమైనవి అందుబాటులో ఉన్నాయి. అధికారులు ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన ఇటువంటిచోట ఏర్పాటుచేస్తే ప్రజలు ఆనందిస్తారు.

ప్రజలలో ఇంకా భయం అనే గుణం అంటిపెట్టుకునే ఉంది. పురోహితుడి నుండి పత్రికా విలేఖర్ల వరకు భయం లేకుండా విధిని నిర్వర్తిస్తున్నవారు దాదాపుగా లేదనే చెప్పవచ్చు. ఒకవేళ ఎవరైనా అలాచేస్తుంటే వారికి ప్రభుత్వ పెద్దల అండదండలు పుష్కలంగా ఉన్నాయని అర్థం చేసుకోవాలి. లేదా లెక్కకు మించిన ధనవంతులై, ధనబలంతో నెగ్గుకువస్తున్నారని భావించాలి.

## ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు వసతులు శూన్యం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదని దీంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు విమర్శించారు. పేద మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం వచ్చే ఆసుపత్రిలో అరకొర వైద్యము మాత్రమే అందుతుందని ఆసుపత్రి నిర్వహణపై స్థానిక శాసనసభ్యులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సరిగ్గా దృష్టి సారించకపోవడమే దీనికి నిదర్శనం అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు కాలంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయలేదని నాలుగు నెలలకు ముందు కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి అమర్నాథ్ పత్రికల్లో ప్రకటించారని, అయినప్పటికీ కమిటీ పాత్ర తూ తూ మంత్రంగానే ఉందని అక్కడ అధికారికంగా ప్రమాణ స్వీకారం జరగలేదని కలెక్టర్ పర్యవేక్షణలో జరగవలసిన సమావేశం ఒకటి జరగలేదని దీనిపై అధికార పార్టీకి మంత్రులకు, అధికారులకు రోగులకి మెరుగైన వైద్యం అందించాలనే ధ్యాస లేదని అన్నారు. ఇది పేరుకే ఏరియా ఆసుపత్రి అని వసతులు శూన్యమని వెంకటరావు అన్నారు.

అస్పత్రి సలహా కమిటీ ఉన్నా లేనట్లుగానే ఉందని, కమిటీ సభ్యులుగా వేసినవారు కూడా ఆసుపత్రి దరిదాపుల్లోకి వెళ్లడం లేదంటే అమర్నాథ్ వేసిన కమిటీకి ఎంత ప్రాధాన్యత ఉందో వారికి బాగా అర్థమయి ఉంటుందని వెంకటరావు వ్యాఖ్యానించారు.

## 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలు అంతంత మాత్రమే : జనసేన

**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** నక్కపల్లి లో ఉన్న ప్రభుత్వ 50 పడకల హాస్పిటల్ లో కరెంట్ కోతలుమరియు కనీసం నైట్ టైం జనరేటర్ కూడా ఆన్ చేయకపోవడం, తాగడానికి వాటర్ సదుపాయం లేకపోవడం, హాస్పటల్ మొత్తంలో ఏ ఒక్క బాత్రూంలో వాటర్ రాకపోవడం వాటర్ లేకపోవడం చిన్నపిల్లలతో మరియు కనీసం గర్భిణీ స్త్రీలకు కూడా ఎటువంటి మెరుగైన సదుపాయంలు లేకపోవడం వల్ల అది తెలిసిన జనసేన పార్టీ మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి సంజీవరావు నక్కపల్లి జనసేన పార్టీ నాయకులు కురందాసు అప్పలరాజు పిక్కి స్వామి అడగగా, ఉదయం 11 గంటలకు ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది అందులో ఉన్న డాక్టర్స్ అడగగానే మొత్తం అన్ని క్లియర్ చేస్తామని చెప్పి ఏమీ పట్టనట్టు ప్రవర్తిస్తున్నారుఅని నక్కపల్లి గవర్నమెంట్ హాస్పటల్లో తగు సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయాలని హాస్పిటల్ నిర్వాహక కమిటీ చైర్మన్ మరియు స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు వినతి పత్రం ఇస్తామని ఈ వైసీపీ ప్రభుత్వాన్ని వెంటనే దిగివచ్చి పని చేయాలని ప్రభుత్వ అస్పత్రిలో కరెంటు కోతలు తాగడానికి బాత్రూంలో వాటర్ సదుపాయం మరి ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు తగిన ఎక్యుప్మెంట్ ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ తరఫున కోరడం జరుగుతుంది అని వీరన్నారు. అతి త్వరగా ఈ సమస్యలన్నీ పరిష్కారం చేయకపోతే జనసేన పార్టీ తరఫున ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేసారు.

## పర్యావరణ దినోత్సవం బహుమతులు ప్రదానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ వీసీసీ జగదాంబ జోన్ పరిధిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలకు ఈరోజు ఉదయం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం లో బహుమతులు రొటేరియన్, ఇంటరాక్ట్ చైర్ మోదంబికా అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ రోటరీ కలసి ఇంటరాక్ట్ క్లబ్ ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. పిల్లలకు అనేక అవకాశాలను కల్పించడం ద్వారా వారిలో ఉన్న విజ్ఞాన తృష్ణ తీరడంతో పాటు పిల్లల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుకు క్లబ్స్ కృషి చేస్తున్నాయి అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వీసీసీ వ్యవస్థాపకులు డా. కొరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ జగదాంబ జోన్ ప్రాంతంలో పిల్లలలకు ఇటువంటి క్లబ్స్ అవసరం చాలా ఉంది, చదువు, పర్యావరణ, పరిసరాల పరిశుభ్రత మొ,, అంశాలపై పిల్లల భాగస్వామ్యం అభివృద్ధి కి దారి తీస్తుంది. వీసీసీ జోన్ కన్వీనర్ ఎల్లాజీ జోన్ లో వీసీసీ విస్తరణ జోన్ కమిటీ పరిధిలో జరగవలసిన ఆవశ్యకత తెలియజేస్తూ జోన్ కమిటీ ని అనౌన్స్ చేశారు. ఈ కార్యక్రమం కి జాహ్నవి, తులసీ అధ్యక్షత వహించగా ఆర్గనైజర్లు మణి, దుర్గ, అనురాధ, సరోజిని వాల%ీ%టీర్లు నరేష్, శ్రీలక్ష్మి, జయంత్ పాల్గొన్నారు. జోన్ పరిధిలో ఉన్న కొబ్బరితోట, కల్లుపాకలు, కృష్ణా గార్డెన్, పండిమెట్ట, అంథోనీ నగర్, జగదాంబ ప్రాంతాల నుంచి హాజరయ్యారు.

## హోటల్ ఆరంజ్ ఇన్ లో విదేశీ యువతులతో వ్యభిచారం ?




**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ పదో వార్డులో గల ఆదర్శనగర్ వద్ద ఉన్న హెూటల్ ఆరెంజ్ ఇన్ లో థాయిలాండ్ చెందిన ఇద్దరు యువతులు, అరుకు చెందిన యువతితో హెూటల్ గదుల్లో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. థాయిలాండ్ యువతులకు మధ్యవర్తి మహేష్ కి ఘర్షణ జరగడంతో పాస్పోర్ట్ తీసుకోవడమే కాకుండా వారిపై చేయి చేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన థాయిలాండ్ యువతి నగర సిపి కార్యాలయానికి వాట్సాప్ యాప్ ద్వారా జరిగిన విషయాన్ని తెలియజేస్తూ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసు అధికారుల ఆదేశాలతో పోలీసులు హెూటల్ ఆరంజ్ ఇన్ పై దాడి నిర్వహించారు. పోలీసులు వస్తున్నట్లు సమాచారంతో మహేష్ పరారయ్యాడు. థాయిలాండ్ కు చెందిన ఇద్దరు యువతలు ను అరుకు చెందిన ఒక యువతిని పోలీసుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. నిందితుడు మహేష్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆరిలోవ ప్రాంతంలో పెదగదిలి, చినగదిలి, శ్రీకాంత్ నగర్, హెల్త్ సిటీ లో లాడ్జి లు ను పోలీసులు పట్టించుకోకపోవడంతో హెూటల్స్ లో మసాజులు, వ్యభిచారం జరుగుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి అనధికార లాడ్జిలపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

## బాండ్స్ మీద ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 9 శాతం ఆఫర్

- ఈ ఇష్యూ జూన్ 22 వరకే..



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బాండ్స్ మీద 9 శాతం ఉత్పత్తిని ఆఫర్ చేస్తున్నట్లు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ హైదరాబాద్ గ్రూప్ సీఎఫ్వో, వైస్ ప్రెసిడెంట్ కపిష్ జైన్ తెలిపారు. ఈ ఇష్యూ జూన్ 22, 2023న ముగుస్తుందన్నారు. సురక్షిత బాండ్ల పబ్లిక్ ఇష్యూని ప్రారంభించి రూ .1,500 కోట్ల వ్యాపార వృద్ధి, మూలధన వృద్ధి ప్రయోజనం కోసం బాండ్‌లు గరిష్టంగా 9 శాతం దిగుబడి, అధిక స్థాయి భద్రతను అందిస్తాయన్నారు. బాండ్ ఇష్యూ అనేది జూన్ 22 లేదా దాని కన్నా ముందు డిమాండ్ బట్టి మూసివేయబడతాయని తెలిపారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సురక్షిత రీడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్‌లను (ఎన్సీడీలు) జారీ చేస్తుందన్నారు. ఇది రూ.300 కోట్లకు, గ్రీన్-షూ ఎంపికతో రూ.1200 కోట్ల వరకు (మొత్తం రూ. 1,500 కోట్లకు) ఓవర్-సబ్‌స్క్రిప్షన్‌ను కలిగి ఉంటుందని పేర్కొన్నారు.

ఐఐఎఫ్ఎల్ బాండ్‌లు 60 నెలల కాలవ్యవధికి సంవత్సరానికి 9 శాతం అత్యధిక ప్రభావవంతమైన రాబడిని అందిస్తాయన్నారు. ఎన్సీడీ 24 నెలలు, 36 నెలలు, 60 నెలల కాల వ్యవధిలో అందుబాటులో ఉంటుందన్నారు. వడ్డీ చెల్లింపు ఫ్రీక్వెన్సీ వార్షిక, మెచ్యూరిటీ ప్రాతిపదికన 60-నెలల కాలవ్యవధికి నెలవారీ ఎంపికతో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## ప్రయారిటీ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి కావాలి : కలెక్టర్



**విజయనగరం:** ప్రభుత్వ ప్రయారిటీ భవనాలైన సచివాలయాలు, ఆర్.బి.కే లు, హెల్త్ క్లినిక్స్ ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. చిన్న చిన్న పనులు పెండింగ్ ఉన్న భవనాలను 15 రోజులలో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయాలనీ సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియం లో శు క్రవారం ప్రయారిటీ భవనాల పురోగతి పై ఎం.పి.డి.ఓ లు ఇంజనీరింగ్ అధికారులతో మండల వారీగా పథకం వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఆన్లైన్ లో పూర్తైనట్లు చూపించారంటే వినియోగానికి సిద్ధంగా ఉన్నట్లు భావించాలని, ఎలాంటి పెండింగ్ పనులు లేవని అర్థం చేసుకోవాలని స్పష్టం చేసారు. పూర్తి కాకుండా పూర్తి చేసినట్లు అప్లోడ్ చేయవద్దని అన్నారు. వచ్చే 15 రోజుల్లో ప్రతి పని స్టేజి మారాలని వర్క్ వారీగా భవనం వారీగా అడుగుతానని, స్టేజి మారక పోతే చర్యలు తప్పవని అన్నారు. మండల ప్రత్యేకాదికారుల తో ప్రజా ప్రతినిధులతో మాట్లాడుకొని పూర్తైన వాటిని ప్రారంభోత్సవాలకు సిద్ధం కావాలన్నారు. ఈ ఏడాది విత్తనాలు, ఎరువులు 50 శాతం వరకు ఆర్.బి.కే ల ద్వారానే సరఫరా జరుగుతాయని, దీనిని దృష్టి లో పెట్టుకొని ఆర్.బి.కే భవనాలకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలన్నారు. అదే విధంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం అందుబాటు లోకి వచ్చినందున హెల్త్ క్లినిక్స్ భవనాలను కూడా త్వరగా పూర్తి చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 45 హెల్త్ క్లినిక్స్ నిర్మాణానికి అనుమతి వచ్చినందున జనాభాను బట్టి ఎక్కడ అత్యంత అవసరం ఉందొ గుర్తించి సోమవారం లోగా ఎం.పి.డి.ఓ లు , ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా రిపోర్ట్ అందించాలని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ నిధుల తో చేపడుతున్నందున ఈ భవనాలకు నిధుల సమస్య ఉండదని అన్నారు. అదే విధంగా ఈ నిధులను హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు తప్ప వేరే పనులకు ఖర్చు చేయకూడదని స్పష్టం చేసారు.

కొత్త ఏజెన్సీ లు నిర్మాణాలకు ముందుకు రాక పోతే ఇప్పటికే బిల్లులు చెల్లించిన ఏజెన్సీల తో మాట్లాడి పనులు చేయించాలన్నారు. బిల్లుల అప్లోడ్ వెంటనే చేయాలనీ , చెల్లింపులకు కూడా ప్రణాళిక ఉండాలని, అందరికీ సమానంగా చెల్లింపులు చేయాలనీ అన్నారు. ఏజెన్సీ ను, లేబర్ ను మొబిలైజ్ చేసుకొని వచ్చే 15 రోజుల్లో పనులు పురోగతి కనపడాలని అన్నారు. వచ్చే 15 రోజుల్లో ఏ ఏ పనులు చేస్తారో చెప్పాలని, నోట్ చేసుకొని మీరు చెప్పిన విధంగానే 15 రోజుల తర్వత సమీక్షిస్తానని, అప్పటికీ చెప్పినవన్నీ పూర్తి చేయాలనీ న్నారు. పనుల్లో నాణ్యత లోపించాకూడదని, ఈ పనుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్ప్ లో భాగంగా ఘన వ్యర్థ నిర్వహణా షెడ్లను పూర్తి చేసి వర్మి కంపోస్ట్ లను చేయాలనీ అన్నారు. ఇంతవరకు 570 ఎస్.డబ్ల్యు.పి.సి యూనిట్లు పూర్తి అయ్యాయని, వీటిని ఆయా పంచాయతి లకు మాపింగ్ చేయాలనీ, మిగిలిన వాటిని పంచాయతి తీర్మానం చేసి పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇన్స్టిట్యూషనల్ టాయిలెట్స్ పూర్తి చేయాలనీ అన్నారు.

ఈ సమావేశం లో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ డా. అశోక్ కుమార్, డుమా పి.డి ఉమా పరమేశ్వరి, ఆర్.డబ్ల్యు.ఎస్., పంచాయతి రాజ్ ఎస్ ఈ లు ఉమా శంకర్, గుప్తా, డి.పి.ఓ శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

## హాస్యపు హరివిల్లు ఇ.వి.వి సినిమా

(నేడు ఇ.వి.వి. సత్యనారాయణ జయంతి)



ఇ.వి.వి గా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన ఈయన దర్శకుడు జంధ్యాల శిష్యుడు. ఇ వి వి మొదటి సినిమా రాజేంద్రప్రసాద్ కథానాయకుడిగా నిర్మింపబడిన చెవిలో పువ్వు. కొద్ది కాలం తర్వాత నిర్మాత రామానాయుడు ప్రేమఖైదీ చిత్రంలో అవకాశమిచ్చారు. ఆ చిత్రం విజయవంతం కావటంతో పలు అవకాశాలు వచ్చాయి. జంధ్యాల వరవడిలో హస్య ప్రధాన చిత్రాలు నిర్మించారు . జంధ్యాల కంటే కొంత ఘాటైన హస్యాన్ని చిత్రాల్లో ప్రవేశపెట్టారు. రాజేంద్ర ప్రసాద్ తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజను దొంగలు వంటి చిత్రాలు, నరేష్ తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశారు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళా పరమైన చిత్రాలు తీశారు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లతో చిత్రాలు తీశారు. కొద్ది విరామం తర్వాత కుమారులిద్దర్ని హీరోలుగా పరిచయం చేశారు.

సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరు లో జూన్ 10, 1958 న వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఈయన కుటుంబానికి దొమ్మేరు లో 70 ఎకరాల పొలం ఉండింది. బాల్యం నుండి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్‌కు నిడదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటంతో హాజరు తక్కువై ఇంటర్మీయట్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయన్ను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వీళ్ళకు రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయవలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ తెగ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి కొన్నాళ్ళు వెళ్ళిపోవాలనుకున్నాడు. ఇ.వి.వి స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బరాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. దేవదాసు కనకాల వద్ద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకునిగా అవకాశం వచ్చింది. అప్పటి నుండి ప్రజా రంజక చిత్రాలను చేస్తూ ప్రేక్షకులకు హాస్యాన్ని పండించారు. వీరు జనవరి 21,2011 న మరణించారు .

డా జొన్నకూటి ప్రమోద్ కుమార్
పైడిమెట్ట 9490833108

# అవిసె గింజలు తింటే గుండె పదిలం



అవిసె గింజలను ఎన్నో శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తున్నారు. అవిసె గింజలలో ఔషద గుణాలతో పాటు, ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. వీటిలో లిగ్నాన్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ బి, మెగ్నీషియం, మాంగనీస్, ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలు తీసుకోవడం వల్ల ప్రమాదకర వ్యాధుల ముప్పు తగ్గుతుంది. అవిసె గింజలు క్రమం తప్పకుండా తీసుకుంటే.. మలబద్ధకం, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించవచ్చు. ఆయుర్వేద డాక్టర్ దీక్షా భావ్‌సార్, మన ఆహారంలో అవిసె గింజలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.

**కొలెస్ట్రాల్ కరుగుతుంది..** అవిసె గింజలు LDL (చెడు కొలెస్ట్రాల్)ను కరిగించి, HDL (మంచి కొలెస్ట్రాల్)ను పెంచుతాయని అధ్యయనాలు వెల్లడించాయి. అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాట్స్ పుష్కలంగా ఉంటాయి. దిని వల్ల రక్తంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయులను నిర్వహించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అవిసె గింజలు మెరుగ్గా పనిచేస్తాయి. అవిసె గింజలను క్రమం తప్పకుండా తినే వ్యక్తుల్లో గుండెపోటు, స్ట్రోక్స్ ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది.

బీపీ కంట్రోల్‌లో ఉంటుంది..

అవిసె గింజలు కూడా రక్తపోటును తగ్గిస్తాయి. డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న వ్యక్తుల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో అవిసె గింజలు సహాయపడతాయి. వీటిని మన డైట్‌లో చేర్చుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి మన శరీరాన్ని కాపాడుతుంది.

**క్యాన్సర్ కణాలతో పోరాడుతుంది..!** మహిళలకు అవసరమైన ఈస్ట్రోజన్, యాంటీ ఆక్సిడెంట్లు రెండూ అవిసె గింజలలో పుష్కలంగా ఉన్నాయి. అవిసె గింజల్లో ఏ శాకాహారంలోనూ లేనంత ఎక్కువగా లిగ్నాన్స్ ఉంటాయి. ఈ గింజల్లోని ఒమెగా-3 యాసిడ్‌కు రొమ్ముక్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ వంటి వాటిని నియంత్రించే గుణం ఉందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి.

**ప్రోటీన్ స్టోర్ హౌస్..** మీరు వెజిటేరియన్స్ అయితే.. మీకు అవిసె గింజలు సూపర్ ఫుడ్ అనే చెప్పాలి. వీటిలో ప్రోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రోజూ మీ డైట్‌లో చేర్చుకుంటే.. ప్రోటిన్ లోపం దూరమవుతుంది.

**జుట్టు బలంగా..** దీనిలో ఉండే.. ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని, వెంట్రుకల కుదుళ్లని ఆరోగ్యంగా ఉంచే కొలాజెన్‌ల ఉత్పత్తికి తోడ్పడతాయి. కుదుళ్లు ఆరోగ్యంగా ఉంటే వెంట్రుకలు బలంగా, ఒత్తుగా పెరుగుతాయి. అవిసె గింజలు జుట్టు ఆరోగ్యంగా ,మెరిసేలా చేయడంలో సహాయపడతాయి. ఈ గింజల్లో విటమిన్-బి కూడా పుష్కలంగా లభిస్తుంది. ఇది జుట్టుకు బలం చేకూర్చడంతో పాటు జుట్టు పొడిబారకుండా చేసి సిల్కీగా ,మెరిసేలా చేస్తుంది.

**ఎలా తీసుకోవాలి..?** వీటిని పచ్చిగా తినడం కన్నా... డ్రైరోస్ట్ చేసి, పొడిచేసుకుని తింటే మంచిది. వీటిని వేయిస్తే.. దీనిలోని హానికారక ఫైటిక్ యాసిడ్ తొలగిపోతుంది. మొలకెత్తించి తిన్నా కూడా మంచిదే. ఈ గింజలు నీళ్లలో వేసినప్పుడు కొద్దిగా ఉబ్బి, జెల్లీలా మారతాయి . అంటే ఇవి నీళ్లను ఎక్కువగా పీల్చుకుంటాయి. అందుకే చెంచా తిన్నా, అరచెంచా తిన్నా తర్వాత నీళు ఎక్కువ తాగాలి. లేదంటే మలబద్ధకం సమస్య వచ్చే ప్రమాదం ఉంది. ఈ జాగ్రత్తలు తీసుకుంటే అవిసెగింజల ప్రయోజనాల్ని సంపూర్ణంగా పొందవచ్చు . వీటిని పొడి రూపంలో తినాలనుకుంటే తప్పనిసరిగా ఫ్రిజ్‌లో దాచిపెట్టాల్సిందే. లేదంటే పోషకాలు త్వరగా పోతాయి.

# బీట్రూట్, ఆకుకూరలు రోజూ తింటే.. లివర్ సమస్యలు రావు



మన శరీరంలో కీలక అవయవాలలో లివర్ ఒకటి. కాలేయం 500 రకాల జీవక్రియలను నిర్వర్తిస్తుంది. మన బాడీలో అతి పెద్ద అంతర్గత అవయవం లివర్. ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది. రక్తంలోని విషపదార్థాలను తొలగిస్తుంది. శక్తిని నిల్వ చేస్తుంది, హార్మోన్లను, ప్రొటీన్‌లను రెగ్యులేట్ చేస్తుంది. ముఖ్యంగా శరీరంలో ఏర్పడే ఇన్ఫెక్షన్లు, కొవ్వులు, రక్తంలోని చక్కెర స్థాయిలను కూడా లివర్ నియంత్రిస్తుంది. కొవ్వును తగ్గించడంలో, కార్బోహైడ్రేట్లను నిల్వ చేయడంలో, ప్రొటీన్లను తయారు చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యమైన హార్మోన్లను, ఎంజైమ్‌లను తయారు చేస్తుంది. లివర్ పాడైనా.. తనను తాను రిపేర్ చేసుకునే సామర్థ్యం దానికి ఉంది. అలా అని లివర్ సమస్యలు రావనుకుంటే పొరపాటే. మన లైఫ్‌స్టైల్‌లో మార్పులు, జంక్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్, సోడా, ఆల్కహాల్, ఇతర కార్బోనేటేడ్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల లివర్ సమస్యలు ఎక్కువయ్యాయి.

ఒక అధ్యయనం ప్రకారం, భారతదేశంలో ప్రతి 5 మందిలో ఒకరు లివర్ సమస్యతో బాధపడుతున్నారు. ఈ కీలకమైన అవయవాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. దీని కోసం, మీ లైఫ్‌స్టైల్‌లో మార్పులు చేసుకుని, మీరు తీసుకునే ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కొన్ని కూరగాయలు లివర్‌కు సూపర్ ఫుడ్స్‌లా సహాయపడతాయి. ఇవి క్రమం తప్పకుండా మీ డైట్‌లో చేర్చుకుంటే.. ఫ్యాటీ లివర్, ఇతర లివర సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చు.

**బీట్ రూట్..** బీట్‌రూట్ మన డైట్‌లో తీసుకుంటే లివర్ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. బీట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇది వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. దీంతో, అవి శరీరం నుంచి త్వరగా బయటకు వెళ్తాయి. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకునేవారు, లివర్ సమస్యలు ఉన్నవారు బీట్ రూట్ జ్యూస్ తాగితే మంచిది.

**బ్రకోలీ..** లివర్ సమస్యలతో బాధపడేవారు బ్రకోలీ తీసుకుంటే మంచిది. బ్రకోలీ రోజూ తీసుకుంటే.. లివర్ దెబ్బతినే ప్రమాదం తగ్గుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు బ్రకోలీ కచ్చితంగా తీసుకోవాలని నిపుణులు అంటున్నారు.

**బ్రస్సెల్స్ స్ప్రౌట్స్..** బ్రస్సెల్స్ స్ప్రౌట్స్, క్రూసిఫరస్ కుటుంబానికి చెందిన వెజిటేబుల్. దీనిలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తే.. చాలా సమ్మేళనాలు బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లో ఉన్నాయి. లివర్ సమస్యలకు దూరంగా ఉండాలంటే.. బ్రస్సెల్స్ స్పౌట్స్ మీ డైట్‌లో చేర్చుకుంటే మంచిది.

**ఆకు కూరలు..** ఆకు కూరలు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చాలా మందికి తెలిసే ఉంటుంది. కాలే, పాలకూర, కొల్లార్డ్ గ్రీన్స్ మీ డైట్‌లో చేర్చుకుంటే లివర్ సమస్యలు రావు. ఈ ఆకు కూరల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి, ప్రమాదక ఫ్రీ రాడికల్స్‌ను శరీరం నుంచి తొలగిస్తాయి. ఈ ఆకుకూరలను కచ్చితంగా మీ డైట్‌లో చేర్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

# జీర్ణ సమస్యలను దూరం చేసే పుదీనా



చట్నీలు తీసుకోవడం కేవలం రుచి కోసం మాత్రమే కాదు. పోషకాహార నిపుణులు రుజుతా దివేకర్ ప్రకారం, మీ భోజనంలో చట్నీలు తినడం సుగంధ ద్రవ్యాలు, ఫైబర్, ఫైటోన్యూట్రియెంట్స్‌ని పరిచయం చేసే ఓ టేస్టీయెస్ట్ పద్ధతి.

**పుదీనా చట్నీ..** చట్నీల్లో చాలా మంది ఇష్టపడే వాటిల్లో ఓ చట్నీ పుదీనా. ఇది రుచిగా ఉండడమే కాదు, జీర్ణ సమస్యల్ని కూడా దూరం చేస్తుంది. వికారం వంటి సమస్యలకి మంచి పరిష్కారం.. మరి ఎలా చేయాలంటే..

100 గ్రాముల తాజా పుదీనా చిన్నగా తురిమి పెట్టుకోండి.. 1 కప్పు ఉల్లిపాయ ముక్కలు, 1 టీ స్పూన్ జీలకర్ర, రుచికి తగినంత ఉప్పు, 2 టేబుల్ స్పూన్ల తరిగిన పచ్చిమిర్చి, 2 స్పూన్ల పంచదార, వీటన్నింటిని కలిపి గ్రైండ్ చేయాలి. ఇప్పుడు చట్నీలో పావు కప్పు పెరుగు గిలక్కొట్టి వేయండి.

ఇది టేస్టీగా ఉంటుంది.

కొబ్బరిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందుకే కొబ్బరి చట్నీ తింటే ప్రేగు కదలికలు మెరుగ్గా ఉంటాయి. అజీర్ణం, డయేరియా, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యల్ని ఇది దూరం చేస్తుంది. కొబ్బరిలో ఎక్కువగా కాపర్, మాంగనీస్, ఐరన్, సెలీనియం, ఫాస్పరస్ కూడా ఉంటాయి.

**తయారీ విధానం..** 1 కప్పు కొబ్బరి తురుము, 1 కప్పు పచ్చిమిర్చి తరుగు, అల్లం పేస్ట్, రుచికి తగినంత ఉప్పు, 2 టేబుల్ స్పూన్ల చింతపండు గుజ్జు, వీటన్నింటిని కలిపి మిక్సీ పట్టండి, 1 స్పూన్ కొబ్బరి నూనె కూడా వేసి బాగా కలపండి. లేకపోతే పోపు పెట్టండి..

**టమాటా చట్నీ..** టమాట చట్నీ అనగానే నోరూరిపోద్ది చాలా మందికి.. ఇందులో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ వైరల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు కలిగి వెల్లుల్లి కూడా ఉంటుంది.

**ఎలా చేయాలంటే..** కడాయిలో నూనె వేడి చేసి ఆవాలు వేయండి.. అందులోనే సన్నగా తరిగిన కరివేపాకు వేసి వేయించండి. 4 సన్నగా తరిగిన వెల్లుల్లి రెబ్బలు వేసి అందులో 250 గ్రాముల సన్నగా తరిగిన టమాటో వేసి వేయించాలి.

1 టేబుల్ స్పూన్ ఎర్రకారం, రుచికి సరిపడా ఉప్పు, అర టీస్పూన్ ఇంగువ వేసి బాగా కలపండి. వేడి చల్లారక మిక్సీ పట్టండి.

**చింతపండు చట్నీ..** కడుపులోని సమస్యల్ని దూరం చేయడంలో చింతపండు బాగా పనిచేస్తుంది. జీర్ణక్రియ మెరుగపరుస్తుంది.

**తయారుచేసే విధానం..** 1 కప్పు చింతపండుని ఓ గిన్నె నిండా నీటిలో రాత్రంతా నానబెట్టండి. మర్నాడు పాన్‌లో వేసి మరిగించండి. చింతపండు మిశ్రమాన్ని వడకట్టండి. ఇప్పుడు స్టౌ మీద పెట్టి ఉడికించండి. కొద్దిగా నీరు, అరకప్పు తరిగిన బెల్లం వేసి కలుపుతూ ఉండండి. 3 నిమిషాల పాటు ఉడికించండి. ఇప్పుడు అర టీస్పూన్ జీలకర్రపొడి, అర టీస్పూన్ అల్లం పొడి, నల్ల ఉప్పు, అర టీ స్పూన్ యాలకుల పొడి కలపండి. కాసేపు ఉడికించండి. అంతే చట్నీ రెడీ.

# శొంఠి వల్ల ఉపయోగాలు



శొంఠిలో ఎన్నో ఔషద గుణాలు ఉన్నాయి. ఆయుర్వేదంలో, అనేక వ్యాధులను తగ్గించడానికి ఎన్నో ఎళ్లుగా శొంఠిని వాడుతున్నారు. పచ్చి అల్లాన్ని పాలలో ఉడక బెడతారు. ఆ తరువాత దాన్ని ఎండబెడితే శొంఠి తయారవుతుంది. ముఖ్యంగా వర్షాకాలం శొంఠి ఇంట్లో వుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వర్షాకాలంలో జలుబు, దగ్గు, జీర్ణ సమస్యలు ఎక్కువగా ఇబ్బంది పెడతూ ఉంటాయి. సీజనల్ వ్యాధులను నివారించడంలో శొంఠి అద్భుతంగా పనిచేస్తుంది. జలుబు చేసినప్పుడు శొంఠి పొడిని నీళ్లలో కలిపి మరగబెట్టి తాగితే ఉపశమనం లభిస్తుంది. అలాగే మరుగుతున్న టీ లేదా కాఫీలో శొంఠి పొడి కలిపి తీసుకుంటే.. మేలు జరుగుతుంది. తాజా అల్లం కంటే శొంఠి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

శొంఠి మన డైట్‌లో చేర్చుకుంటే. మన ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేద వైద్యురాలు రేఖా రాధామని ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ షేర్ చేశారు. శొంఠిని హీరోగా అభివర్ణించారు. ఘాటుగా ఉండే శొంఠి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు.

**గ్యాస్ సమస్య దూరమవుతుంది..** తాజా అల్లం వాతాన్ని పెంచుతుంది, శొంఠి వాతాన్ని సమతుల్యం చేస్తుందని డా. రేఖా రాధామని అన్నారు. గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్య ఉంటే.. గోరువెచ్చని నీటిలో శొంఠి పొడి వేసుకుని తాగితే.. ఉపశమనం లభిస్తుంది. శొంఠి పొడి దీర్ఘకాలిక అజీర్ణం వల్ల కడుపు నొప్పి , కడుపులో అసౌకర్యం నుంచి ఉపశమనం ఇస్తుంది.

**మలబద్ధకానికి చెక్..** శొంఠి పొడి క్రమం తప్పకుండా మీ డైట్‌లో చేర్చుకుంటే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శొంఠిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు శొంఠి సహాయపడుతుంది. ఉదయాన్నే బౌల్ కదలికలు కష్టంగా ఉంటే.. గోరువెచ్చని నీటిలో శొంఠి పొడి కలిపి తీసుకుంటే మీకు ఫ్రీగా ఉంటుంది.

**జలుబుకు ఔషదం..** ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. శొంఠి కఫాన్ని తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. శొంఠి నీరు తీసుకుంటే జలుబు, దగ్గు దూరమవుతాయి. ఫ్లూ సమస్యతోనూ పోరాడటానికి శొంఠి సహాయపడుతుంది. ఈ రోజుల్లో శొంఠి మీ డైట్‌లో చేర్చుకుంటే ఇన్ఫెక్షన్లు, ఫ్లూ వంటివి దరిచేరవు.

**ఇమ్యూనిటీ పెరుగుతుంది..** శొంఠిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

**ఎలా తీసుకోవాలి..?** శొంఠిని కషాయంగా చేసుకుని తీసుకుంటే.. ఆరోగ్యానికి మేలు జరుగుతుందని డా. రేఖ అన్నారు. దీన్ని తయారు చేయడం చాలా సులభం. ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీరు తీసుకుని, 1 చిటికెడు శొంఠి పొడి వేసి మరిగించండి. దానిలో 1 గ్లాసు నీరు మిగిలే వరకు మరిగించాలి. ఆ తర్వాత దించి.. గోరువెచ్చగా అయిన తర్వాత తాగండి.

# ఆయిలీ స్కిన్ నుంచి ఉపశమనం పొందాలంటే ఏం చేయాలి



స్కిన్ కేర్ అనేది చాలా ముఖ్యం. ముఖ్యంగా ఆయిలీ స్కిన్ ఉంటే చాలా కేర్ తీసుకోవాలి. ఆయిలీ స్కిన్ సమస్య ఉండేవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..

ఆరోగ్య పరిరక్షణలో కీలకం స్కిన్ కేర్. చర్మ సంరక్షణకు చాలా జాగ్రత్తలు అవసరం. చర్మ సంరక్షణలో ప్రధానమైనంది క్లీనింగ్. ముఖంపై ఉండే దుమ్ము, ధూళి, వ్యర్థాల్ని తొలగించాలంటే ప్రధానంగా కావల్సింది క్లీనింగ్. అయితే ముఖం క్లీన్ చేసేటప్పుడు కొన్ని కీలకమైన విషయాల్ని పరిగణలో తీసుకోవాలంటున్నారు చర్మ సంరక్షణ నిపుణులు. స్కిన్ ఎలాంటిదో పరిశీలించాలి. ఎందుకంటే అన్ని స్కిన్ టైప్ సమస్యలకు వేర్వేరుగా చికిత్స ఉంటుంది. మీది ఆయిలీ స్కిన్ అయితే..శుభ్రం చేసే పద్ధతి వేరేలా ఉంటుంది. ఆయిలీ స్కిన్ ఉన్నవాళ్లు..ముఖాన్ని క్లీన్ చేసేటప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాల్ని పరిగణలో తీసుకోవాలి. ఆ వివరాలు మీ కోసం..

ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ ముఖాన్ని క్లీన్ చేసేముందు ఈ విషయాన్ని పాటించాలి. మీ స్కిన్ ఆయిలీగా ఉంటే..క్లీన్సర్ లేదా ఫేస్‌వాష్‌తో క్లీన్ చేయకూడదు. మ్యాట్ ఫినిషింగ్ ఉండే ఫేషియల్ క్లీన్సర్‌ను మాత్రమే వినియోగించాలి. ఎందుకంటే ఇది మీ ఆయిలీ స్కిన్ రోజంతా ఆయిలీగా కన్పించకుండా చేస్తుంది. చార్ కోల్ క్లీన్సర్ మంచి ఫలితాలనిస్తుంది.

**డబుల్ క్లీన్సింగ్ పద్ధతులతో..** ఆయిలీ స్కిన్ ఉన్నవాళ్లు కేవలం క్లీన్సర్ ఉపయోగిస్తే సరిపోదు. డబుల్ క్లీన్సింగ్ పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో ముందుగా మినరల్ వాటర్ సహాయంతో మేకప్, వ్యర్థాలు లేదా ముఖంపై ఆయిల్ తొలగించాలి. ఆ తరువాత ఫేస్‌వాష్‌తో స్కిన్ క్లీన్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల తరచూ ముఖంగా ఆయిల్ రాకుండా నియంత్రించవచ్చు.

# సోడాతో ఆరోగ్యానికి ప్రమాదకరం



ఆహారపు అలవాట్లు, పానీయాల విషయంలో ఒక్కొక్కరిదీ ఒక్కొక్క అభిరుచి ఉంటుంది. కొన్ని ఆరోగ్యాన్ని కల్గిస్తే..మరికొన్ని అనర్థాలకు దారి తీస్తుంది. సోడా తాగడం ఇందులో ఒకటి. సోడా తాగితే కలిగే దుష్పరిణామాలేంటో తెలుసుకుందాం..

మనం తినే ఆహార పదార్థాలు, పానీయాలను బట్టి ఆరోగ్యం, అనారోగ్యం ఆధారపడి ఉంటాయి. చాలామందిలో సోడా తాగే అభిరుచి ఎక్కువగా ఉంటుంది. ఏ మాత్రం కొద్దిగా అసౌకర్యంగా ఉన్నా సరే..సోడా తాగుతుంటారు. ఇంకొంతమందైతే రోజూ తాగుతుంటారు. కొందరు రాత్రి భోజనం తరువాత సోడా తాగడం అలవాటు చేసుకుంటారు. అయితే ఇలా సోడా తాగడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని చాలామందికి తెలియదు. రోజూ సోడా తాగడం వల్ల ఎముకలు బలహీనంగా మారతాయి. మీక్కూడా ఆ అలవాటుంటే వెంటనే మానేయడం మంచిది.

**సోడాతో కలిగే దుష్పరిణామాలు :** ఆస్తమా సమస్య ఉన్నవాళ్లు సోడాను పూర్తిగా దూరం పెట్టాలి. ఎందుకంటే సోడాలో ఉండే ప్రిజర్వేటివ్ సోడియం బెజోయిట్ అనేది ఆస్తమాను ట్రిగ్గర్ చేస్తుంది. రోజూ సోడా తాగే అలవాటున్నవారిలో ఎముకలు బలహీనంగా మారిపోతాయి. సోడాలో ఉండే ఫాస్పోరిక్ యాసిడ్ అనేది శరీరం నుంచి కాల్షియంను బయటకు పంపించేస్తుంది. అందుకే సోడా తాగడం ఆరోగ్యానికి మంచిది కాదంటారు వైద్య నిపుణులు.

**కేన్సర్ ముప్పు :** కొంతమంది డైట్ సోడా తాగుతుంటారు. కానీ డైట్ సోడా కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. ఇందులో ఉండే ఆర్టిఫిషియల్ స్వీట్నర్ స్థూలకాయానికి దారితీస్తుంది. అంతే కాకుండా కేన్సర్ ముప్పును పెంచుతుంది. రోజూ సోడా తాగే అలవాటుండేవారిలో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువౌతాయి.

# పసుపు, నిమ్మకాయ, అల్లం నీళ్లతో 3-4 వారాల్లోనే అధిక బరువుకు చెక్



అధిక బరువుతో బాధపడుతున్నారా..3-4 వారాల్లోనే బరువు తగ్గించుకోవాలా..అలా అయితే ఈ చిట్కా పాటిస్తే మీరు ఊహించినట్టే అవుతుంది.

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచాలంటే తిండి, నీరు కూడా ఆరోగ్యంగా ఉండటం అవసరం. తినే ఆహారంలో సమస్య ఉంటే వివిధ రకాల రోగాలు చుట్టుముడతాయి. అందుకే ఆయుర్వేద శాస్త్రంలో అద్భుతమైన చిట్కా వైద్యం అందుబాటులో ఉంది. ఈ చిట్కా పాటిస్తే ఆరోగ్యంగా ఉండటమే కాకుండా...చాలా వేగంగా బరువు తగ్గించుకోవచ్చు. కేవలం పసుపు, నిమ్మకాయ, అల్లం సహాయంతో అధిక బరువు సమస్య నుంచి విముక్తులు కావచ్చు. ఆరోగ్యపరమైన ప్రయోజనాలు పొందవచ్చు.

**పసుపు, నిమ్మకాయ, అల్లం ప్రయోజనాలు :** ఆరోగ్యంగా ఉండేందుకు, వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకునేందుకు ఇమ్యూనిటీ బలంగా ఉండటం చాలా అవసరం. దీనికోసం పసుపు, నిమ్మకాయ, అల్లం నీరు మంచి ఔషధంగా ఉపయోగపడుతుంది. మీ ఇమ్యూనిటీని పెంచుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటే..పసుపు బెస్ట్ యాంటీ బయోటిక్ గుణాలు కలిగి ఉంది. అందుకే రోజూ క్రమం తప్పకుండా తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి.

**కిడ్నీ, లివర్‌కు ప్రయోజనం :** లివర్, కిడ్నీ సంబంధిత సమస్యల్నించి విముక్తి పొందాలంటే అల్లం, పసుపు, నిమ్మకాయ నీళ్లను సేవించాలి. ఎందుకంటే లివర్, కిడ్నీల్నించి విష పదార్థాల్ని తొలగించడంలో ఈ మూడూ కీలకంగా ఉపయోగపడతాయి. ఈ మూడూ లివర్‌ను డీటాక్సిఫై చేస్తాయి. ప్రతిరోజూ ఉదయం ఈ మూడింటి మిశ్రమం తీసుకుంటే మెరుగైన ఫలితాలుంటాయి.

**3-4 వారాల్లో అధిక బరువుకు చెక్ :** బరువు తగ్గించేందుకు అల్లం, నిమ్మకాయ, పసుపు నీరు అద్భుతంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా 3-4 వారాల్లోనే వేగంగా బరువు తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తాయి. బరువు తగ్గడంలో ఉపయోగపడతాయి. ఈ మూడింటి మిశ్రమంలో హెల్త్ డ్రింక్ తయారు చేసేందుకు ముందుగా..గ్లాసు నీళ్లలో ఒక అల్లం ముక్క వేసి బాగా ఉడకబెట్టాలి. తరువాత ఇందులో ఒక స్పూన్ నిమ్మరసం, అర స్పూన్ పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమం చల్లారిన తరువాత టీ లేదా కాఫీ తాగినట్టు తాగేయాలి. ఇలా ప్రతిరోజూ పరగడుపున చేస్తే కేవలం 3-4 వారాల్లోనే బరువు తగ్గుతారు.

# లక్నో కోర్టు కాల్పుల్లో గాయపడ్డ ఏడాదిన్నర బాలిక-ఆస్పత్రికెళ్లి పరామర్శించిన యోగీ



ఉత్తర్ ప్రదేశ్ లోని లక్నోలో తాజాగా గ్యాంగ్ స్టర్-రాజకీయ నేత ముక్తార్ అన్సారీ అనుచరుడు సంజీవ్ మహేశ్వరి జీవాను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. లక్నో కోర్టుకు హాజరైన నేపథ్యంలో ఆయన్ను జడ్జి ముందే కాల్చి చంపారు. అయితే ఈ కాల్పుల్లో కోర్టు ప్రాంగణంలో ఉన్న ఓ ఏడాదిన్నర పాపకు కూడా గాయాలయ్యాయి. దీంతో ఈ బాలిక ఆరోగ్యంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

లక్నో కోర్టు కాల్పుల్లో గాయపడిన ఏడాదిన్నర పాపను స్థానిక కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ కేజేఎంయూ లోని ట్రామా సెంటర్ లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ పాపను సీఎం యోగీ ఆదిత్యనాథ్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పాపకు మెరుగైన చికిత్స అందించి కాపాడాలని ఆస్పత్రి అధికారులకు యోగీ ఆదేశాలు ఇచ్చారు. అయితే పాప ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని డాక్టర్లు తెలిపారు.

బుల్లెట్ గాయంతో బాధపడుతున్న పాప లక్ష్మి చికిత్స పొందుతున్న వార్డుకు ఆదిత్యనాథ్ చేరుకుని ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ సపోర్టులో ఉన్న బాలిక ముఖ్యమంత్రి వైపు చూస్తుండటంతో.. ఆయన కూడా బాలికతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ముఖ్యమంత్రి కూడా ఆమె నుదుటిని తాకి చాక్లెట్లు ఇచ్చారు. బాలికతో పాటు ఇదే కాల్పుల్లో గాయపడ్డ పోలీసు కానిస్టేబుల్ పరిస్థితి నిలకడగా ఉందని చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ సందీప్ తివారీ వెల్లడించారు.

పాపకు ఆక్సిజన్ సపోర్టు ఉందని, ఆమె పరిస్థితి నిలకడగా ఉందని తివారీ పేర్కొన్నారు. అనంతరం ఆమె శరీరంలోని బుల్లెట్‌ను బయటకు తీయడానికి ఆపరేషన్ కూడా నిర్వహించారు. బాలికకు ఆస్పత్రిలో ఉచిత చికిత్సనే అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆమెకు మెరుగైన చికిత్స అందిస్తామని ఆమె తల్లిదండ్రులకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి యోగీ హామీ ఇచ్చారు. చికిత్స కోసం ఏదైనా అవసరమైతే ప్రభుత్వానికి తెలియజేయాలని యూనివర్సిటీని యోగీ కోరారు.

# ఏపీ స్కూళ్ల రీఓపెనింగ్ వాయిదా ?



ఏపీలో వడగాల్పుల ప్రభావం ఇంకా కొనసాగుతోంది. కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు ఇంకా రాష్ట్రాన్ని పలకరించకపోవడంతో జనం వేడి, ఉక్కపోతకు అల్లాడుతున్నారు. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్కూళ్లను షెడ్యూల్ ప్రకారమే జూన్ 12న అంటే మరో మూడు రోజుల్లో పునఃప్రారంభం చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు అధికారుల్ని సిద్ధం చేస్తోంది. దీనిపై విమర్శలు వస్తున్నాయి.

రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత ఇంకా తగ్గకపోయినా పాఠశాలల్ని పునఃప్రారంభం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై తల్లితండ్రులు, టీచర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వడగాల్పుల తీవ్రత తగ్గాక స్కూళ్లను పునఃప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం మాత్రం మౌనం వహిస్తోంది. ఎలాగో వచ్చేవారు రుతుపవనాలు ఏపీని తాకే అవకాశం ఉంది కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండబోదని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

మరోవైపు జూన్ 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించాలన్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కోరారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కారణంగా పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేయాలని ఆయన కోరారు. జూన్ రెండవ వారం ముగుస్తున్నా ఇప్పటికీ అధిక ఉష్ణోగ్రత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో పాఠశాలలకు విద్యార్థులు హాజరైతే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని సత్యప్రసాద్ సీఎం జగన్ కు రాసిన లేఖలో తెలిపారు.

ఎండ వేడికి తట్టుకోలేక మీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏసీ రూముల్లో నుంచి బయటకు రావట్లేదని, అలాంటిది చిన్న పిల్లలు పాఠశాలలకు ఎలా వస్తారని ఎమ్మెల్యే సత్యప్రసాద్ సీఎం జగన్ ను ప్రశ్నించారు. ప్రభుత్వానికి స్కూళ్ల ప్రారంభంపై ఉన్న శ్రద్ధ నాడు-నేడు పనులు పూర్తి చేయడంలో ఎందుకు లేదని ఆయన ప్రశ్నిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పాఠశాలల పునఃప్రారంభం పది రోజులు వాయిదా వేయాలని ఆయన కోరారు.

# నాదెండ్ల మనోహర్‌కు టీడీపీ షాక్



ఏపీలో టీడీపీ, జనసేన పొత్తు ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీతో కలిసి వెళ్లాలని భావిస్తున్నా ఆ పార్టీ కలవటంపైన ఇంకా స్పష్టత లేదు. బీజేపీ అధికారికంగా నిర్ణయం తీసుకొనే వరకూ వేచి చూడాలని టీడీపీ, జనసేన భావిస్తున్నాయి. ఇదే సమయంలో రెండు పార్టీల్లోని ముఖ్య నేతల మధ్య సీట్ల పంచాయితీ మొదలైంది. జనసేనలో నెంబర్ టూ గా ఉన్న నాదెండ్ల మనోహర్ తాను పోటీ చేసే సీటు పైన ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ఇప్పుడు టీడీపీ ముఖ్య నేత ఆ సీటు తనదేనని..తాను పోటీ చేసి తీరుతానని ప్రకటించారు.

**తెనాలిపై మనోహర్ ఆశలు:** జనసేనతో పొత్తు అధికారికంగా ప్రకటన చేయలేదు. రెండు పార్టీలు కలిసి వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్దమవుతున్నాయి. కలిసి వస్తే బీజేపీ, లేకపోతే ఈ రెండు పార్టీలే వైసీపీకి వ్యతిరేకంగా పోటీ చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసాయి. జనసేనాని పవన్ ఈ నెల 14వ తేదీ నుంచి వారాహి యాత్ర ప్రారంభిస్తున్నారు.

పొత్తులు ఖాయమని పవన్ స్పష్టం చేసారు. సీట్ల గురించి చంద్రబాబు...పవన్ చర్చిస్తారని చెప్పిన జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్ తాను వచ్చే ఎన్నికల్లో తెనాలి నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. తెనాలిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనేది తన లక్ష్యంగా చెప్పుకొచ్చారు. తాను పోటీ చేయటం ఖాయమని..ఎవరికీ సందేహాలు అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. దీంతో, పొత్తులో భాగంగా తెనాలి సీటు జనసేన నుంచి మనోహర్ కు ఖాయమని అందరూ భావించారు.

టీడీపీ నేత తేల్చేసారు: ఇప్పుడు టీడీపీ ముఖ్య నేత..మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేసారు. వచ్చే ఎన్నికల్లో తెనాలి నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. అవినీతి చేసిన ప్రతీ ఒక్కరి గుండెల్లో నిద్రపోతా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. తాను పోటీలో లేనని సంతోషిస్తున్న వారందరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు.

# బెంగళూరు నుంచి తిరుపతికి హెలికాప్టర్ సేవలు



**బెంగళూరు:** ఐటీ హబ్, సిలికాన్ సిటీగా గుర్తింపు తెచ్చుకున్న బెంగళూరు నుంచి నుంచి తిరుపతి వెళ్లి అక్కడి నుంచి తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామి అలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకునే భక్తులకు ఓ శుభవార్త. ఇక నుంచి బెంగళూరులో నివాసం ఉంటున్న ప్రజలు తిరుమల తీర్థయాత్ర చేయడం చాలా సులభం అవుతోంది. ఎందుకంటే బెంగళూరు నుంచి తిరుపతికి హెలికాప్టర్ లో ప్రయాణం చేసి తరువాత తిరుపతి నుంచి తిరుమలకు రోడ్డు మార్గంలో వెళ్లడానికి అవకాశం చిక్కింది.

హంచ్ వెంచర్స్‌తో కలిసి బ్లేడ్ ఇండియా సంస్థ బెంగళూరు-తిరుపతి మార్గంలో హెలికాప్టర్ సర్వీసు సేవలను ప్రారంభించింది. బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి సుమారు 250 కిలోమీటర్ల దూరం ఉంది. తిరుపతి నుంచి తరువాత భక్తులు తిరుమల చేరుకుంటారు. కర్ణాటక రాజధాని నుండి సుమారు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి హెలికాప్టర్ లో వెళ్లడానికి అవకాశం వచ్చింది. ప్రతి నెల లక్షలాది మంది భక్తులు తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు.

తిరుమల తీర్థయాత్రను సులభతరం చేయడానికి కొత్తగా బెంగళూరు నుంచి తిరుపతికి హెలికాప్టర్ సేవలు ప్రారంభించారు, ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని హెచ్ఏఎల్ విమానాశ్రయం నుండి తిరుపతికి హెలికాప్టర్ ఈ సేవలను అందిస్తోంది. ఉదయం 9.15 నుండి 9.30 గంటల మధ్య బెంగళూరులోని హెచ్ఏఎల్ విమానాశ్రయంలో హెలికాప్టర్ బయలు దేరుతుంది. అదే రోజు సాయంత్రం 4 గంటల నుండి 4.15 గంటల మధ్యలో తిరుపతి నుండి బెంగళూరుకు బయలుదేరవచ్చు.

తిరుపతికి బయలుదేరే హెలికాప్టర్‌లో ఐదుగురు ప్రయాణించడానికి అవకాశం ఉంది. హెలికాప్టర్ రైడ్ బెంగళూరు-తిరుపతి నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. బెంగళూరు నుండి తిరుపతికి సుమారు నాలుగు గంటల నుంచి ఐదు గంటల ప్రయాణించడానికి సమయం పడుతుంది. హెలికాప్టర్ సేవతో తిరుమల వెళ్లే భక్తులు దాదాపు 1. 5 గంటల్లో తిరుపతి చేరుకోవడానికి అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు అంటున్నారు.

తరువాత తిరుపతి నుంచి తిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. బెంగళూరు నుంచి తిరుపతికి హెలికాప్టర్‌లో ప్రయాణించాలంటే జీఎస్టీ మినహా దాదాపు రూ.3, 50, 000 ఖర్చు అవుతుంది. రూ. 3, 50, 000 నుండి పూర్తి హెలికాప్టర్ అందుబాటులో ఉంది. రూ. 3. 50, 000 లక్షలకు ఒకేసారి ఐదుగురు ప్రయాణికులు వెళ్లవచ్చు. ఒంటరిగా వెళుతున్నప్పటికీ మీరు ఈ ప్రైవేట్ హెలికాప్టర్ పొందవచ్చు.

ఫ్లైబ్లేడ్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా బుకింగ్‌లు చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. BLADE India వెబ్‌సైట్‌లో లేదా 1800-102-5233లో బుకింగ్‌లు చేయవచ్చు. బుకింగ్‌లు కనీసం 24 గంటల ముందుగానే చేయాలి. దేశవ్యాప్తంగా యాత్రికులు తిరుపతి నగరానికి చేరుకుని తరువాత తిరుమల వెళ్లడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి తిరుపతిలోని విమానాశ్రయానికి(రేణిగుంట విమానాశ్రయం)కు చాలా మంది చేరుకుని తరువాత తిరుమల వెలుతున్నారు.

గత ఏడాది అక్టోబర్‌లో హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్ నుంచి కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వరకు ఫ్లైబ్లేడ్ ఇండియా ఛాపర్ సర్వీసును ప్రారంభించింది. నగరం నుంచి విమానాశ్రయానికి రెండు గంటల ప్రయాణ సమయాన్ని కేవలం 15 నిమిషాలకు తగ్గించింది. ఇది బెంగళూరు నుండి కర్ణాటకలోని మలెనాడు మరియు కబిని ప్రాంతాలకు ఛాపర్ సేవలను కూడా అందిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో, ఫ్లైబ్లేడ్ ఇండియా గోవా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్తో కొన్ని ఒప్పందాలు కుదుర్చుకుంది.

# జాతీయస్థాయి పోటీలలో యోగాలో స్వర్ణపతకం సాధించిన న్యాయవాదికి సన్మానం



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 72వ వార్డు ఉడా కాలనీలో వైసిపి రాష్ట్రఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్టిపూడి పరదేశిఆధ్వర్యంలో ఇటీవలే ఇండియా రాజధాని ఢిల్లీలో జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో యోగాలో స్వర్ణ పథకం సాధించిన ప్రముఖ న్యాయవాది మరియు ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండి బోయిన లక్ష్మి గారిని పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకం సాధించిన అండి బోయిన అప్పారావుని ముఖ్య అతిధి గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి చేతుల మీదగా శాలువా కప్పి పుష్పగుచ్చంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ముందుగా జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని స్వర్ణ పథకం సాధించిన అండి బోయినలక్ష్మి అండి బోయిన అప్పారావు అభినందనలు తెలియజేశారు. అలాగే ఇదివరకు కూడా ఎన్నో మెడల్స్ సాధించి డిస్ట్రిక్ట్, స్టేట్, నేషనల్ లెవెల్ లో రన్నింగ్ లోస్వర్ణ పథకాలు సాధించారు. ఇప్పుడు యోగాలో కూడా నేషనల్ లెవెల్ లో ఢిల్లీలో స్వర్ణ పథకం సాధించడం మన రాష్ట్రానికి గాజువాక నియోజకవర్గం ఎంతో గర్వకారణంవారుకొనియాడారు ఇంకా ఎన్నో మెడల్స్ సాధించాలని మన రాష్ట్రానికి మన దేశానికి పేరు ప్రత్యక్షలు తీసుకురావాలని మనసారా కోరుకుంటు న్నామని అన్నారు.. ఈ కార్యక్రమంలో వైసిపి రజక డైరెక్టర్ యువశ్రీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంపటి అప్పారావు రంభ నారాయణమూర్తి మంత్రి శంకర్ నారాయణ, చిత్రాడ వెంకటరమణ, గొందేసి సత్య రావు,,గొరుసు సత్యంరెడ్డి, పిట్ట రెడ్డి, వాసు అప్పల రెడ్డి,గొందేశి అప్పల రెడ్డి, తోకాడ అప్పారావు,ప్రసాద్ రెడ్డి కాకినాడ పెంటారావు , ములకల పల్లి వెంకటేష్, టేక్ ఏటి శ్రీను, గొందేసి అప్పల రెడ్డి బొండా గోవింద్ నందికి తాతా రావు సారి పిల్లి పైడయ్య బత్తినరాము శంకర్రావు అలేఖ్య జగన్నాథ శ్రీను బాడిత పోయిన పరదేశిలు పాల్గొన్నారు.

# 70వ వార్డులో డ్రైడే-ఫ్రైడే




**గాజువాక, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 70వ వార్డులో శుక్రవారం జరిగిన డ్రైడే-ఫ్రైడే, మలేరియా నివారణ మాసోత్సవాలు, స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలలో ముఖ్య అతిధులుగా జోన్ - 6 (గాజువాక) కమీషనర్ పొందూరు సింహాచలం, వార్డు కార్పొరేటర్ చంద్రశేఖర్ లు పాల్గొని డెంగ్యూ, మలేరియా, చికున్ గునియా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్న నాడు ఎటువంటి సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉంటాయన్నారు. అయితే ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా ఉన్నా ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలంతా సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశముందని ప్రతీ వార్డులో ఉన్న అర్బన్ ప్రైమరీ సెంటర్లలో డెంగ్యూ, మలేరియా టెస్ట్ లు నిర్వహిస్తున్నారని కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అక్కడ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అదేవిధంగా ఇంట్లో లభ్యమయ్యే వ్యర్థాలను తడి-పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తగా వేరు చేసి క్లాప్ వెహికల్స్ కు అందజేసి స్వచ్ఛ విశాఖకు సహకరించాలని వారిరువురు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్ హెచ్ వో కిరణ్ కుమార్, మలేరియా ఇనిస్పెక్టర్ దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# డైట్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరించిన హేమచంద్ర రెడ్డి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మ్యాగజైన్ ను మంగళగిరి రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యాలయము లో,ఏ.పి స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కే హేమచంద్ర రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ మ్యాగజైన్ లో కళాశాల సాధించిన ప్రగతి, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం,కళాశాలలో నిర్వహిస్తున్నటువంటి సాహితి ,సాంస్కృతిక కార్యక్రమాలు, అన్ని రంగాలలో విద్యార్థులు సాధించిన అవార్డ్స్ ,రివార్డ్స్ పొందు పరిచారు. .హేమచంద్ర రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మానవ వనరుల శాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేంవర్క్ ర్యాంకింగ్ లో డైట్ కు 150 - 300 బ్యాండ్ ర్యాంకు లో నిలిచినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ .ఇటీవలే డైట్ కు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ 3 .11 స్కోర్ తో 'ఏ ' గ్రేడ్ సాధించడం గర్వకారణం అని ప్రైవేట్ యూనివర్సిటీ లకు ధీటుగా ఉన్నత ప్రమాణాలతో కళాశాలను నడుపుతున్న దాడి రత్నాకర్ ని అభినందించారు. ఈ కార్యక్రమములో వరప్రసాద్ రెడ్డి (,చైర్మన్ ఏ పి టూరిజం కార్పొరేషన్ ),గంగిరెడ్డి ,చైర్మన్ , ఏ పి పి ఈ సీఎంఏ , -కోటేశ్వర రావు శాంతి రాముడు ,చైర్మన్ శాంతిరాం మెడికల్ కాలేజీ -సతీష్ రెడ్డి ,డైరెక్టర్ ,ఆదిత్య కాలేజీ ,తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్‌గా సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్‌గా రామకృష్ణ



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నిక జరిగింది. నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం రిటర్నింగ్ ఆఫీసర్‌గా, మున్సిపల్ కమిషనర్ కనకారావు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా, వ్యవహరించి వారి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. చైర్ పర్సన్‌గా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 వార్డు కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ కొనేటి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లతో పాటు, కౌన్సిల్‌లో ఓటు హక్కు కలిగి ఉన్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ కూడా హాజరయ్యారు. ఈ ఎన్నికకు ఈయనకు టిడిపి కౌన్సిలర్లు 12 మంది, జనసేన కౌన్సిలర్ ఒకరు హాజరు కాలేదు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండేళ్ల కాలపరిమితికి మున్సిపల్ చైర్‌పర్శన్‌గా ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్‌గా గొలుసు నరసింహమూర్తి ఇప్పటివరకు పని చేశారు. వీరిద్దరూ రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. దీంతో 17 మంది కౌన్సిలర్లు చైర్ పర్శన్‌గా బోడపాటి సుబ్బలక్ష్మిని, వైస్ చైర్మన్‌గా కొనేటి రామకృష్ణను చేతులెత్తి ఎన్నుకున్నారు. దీంతో ఆర్డీవో జయరాం వీరికి ఎన్నిక పత్రాలు అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు.

## హై వే పైన లైట్లు కూడలిలో పోలీస్ గస్తీ ఏర్పాట్లు చేయండి.. సీఐటీయూ

**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** జాతీయ రహదారిపై నక్కపల్లి నుండి పాయకరావుపేట వరకూ గ్రామాల కూడలిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నాము.పాయకరావుపేట నుండి ఎలమంచిలి వరకూ ఉన్న ఈ జాతీయ రహదారి ప్రాంతాన్ని ప్రభుత్వం ఇప్పటికే యాక్సిడెంట్ జోన్ గా గుర్తించారు, రాత్రి సమయంలో జాతీయ రహదారిపై గ్రామాలు కూడలిలో (జంక్షన్) లో విద్యుత్ లైట్లు లేకపోవడం చేత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలు కూడలిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుచున్నాము. అదేవిధంగా నక్కపల్లి ఉపమాక ఆర్చి జంక్షన్, కాంప్లెక్స్ జంక్షనల వద్ద ఉదయం, సాయింత్రం సమయంలో ట్రాఫిక్ ను నియంత్రించేందుకు పోలీసులను ఏర్పాటు చేయాలని కోరుతున్నాము ఆ సమయాలలో ఇంజెక్షన్ లో రోడ్డు దాటడం చాలా కష్టం అవుతుంది, అంతేకాకుండా ఈ నెల 12 నుండి పాఠశాలలు ప్రారంభిస్తున్నారు అప్పుడు ఉదయం, సాయింత్రం విద్యార్థులు రోడ్డుకు అటు ఇటు వెళ్ళడం సాధ్యం కావడంలేదు అందువలన ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఏర్పాటు చేయాలని నక్కపల్లి సీఐ సంబంధిత అధికారులను విన్నవించుచున్నాము అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు.

## బిసి గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** మహాత్మజ్యోతిరావుపూలే వెనుకబడిన సంక్షేమ తరగతుల గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, తానాం చోడవరం, పాయకరావుపేట గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఈ నెల 12లోపు సమీపంలో ఉన్న పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 17న ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

## వైఎస్ వివేకా మర్డర్.. వెలుగులోకి సంచలన విషయం!



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని జూన్ 3న సీబీఐ అరెస్టు చేసిందనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఆయనకు తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వడంతో ఆ ఆదేశాల మేరకు వెంటనే బెయిల్ పై విడుదల చేసిందని విశ్వసనీయ సమాచారం.

అవినాష్ రెడ్డి అరెస్టుకు సంబంధించిన సమాచారం తాజాగా జూన్ 9న గురువారం వెలుగులోకి వచ్చింది. ఐదు రోజుల పాటు అవినాష్ రెడ్డి అరెస్టును సీబీఐ అధికారులు గోప్యంగా ఉంచారు.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వైఎస్ అవినాష్ రెడ్డి జూన్ 3న తమ ముందు హాజరయ్యాక ఆయనను సీబీఐ అరెస్టు చేసింది. అయితే హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో అదే రోజు బెయిల్ పై విడుదల చేసింది.

మే 31న వైఎస్ అవినాష్ రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆదేశాల్లో పిటిషనర్ (వైఎస్ అవినాష్)ను సీబీఐ అరెస్టు చేసినట్లయితే.. ఇద్దరు పూచీకత్తుతో రూ. 5 లక్షలు చెల్లిస్తే బెయిల్పై విడుదల చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే.

అవినాష్ రెడ్డి విచారణకు సహకరించాలని జూన్ నెలాఖరు వరకు ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐ ఎదుట విచారణకు అవసరమైనప్పుడు క్రమం తప్పకుండా హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు.

సీబీఐ నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని ప్రాసిక్యూషన్ సాక్షులను తారుమారు చేయవద్దని సాక్ష్యాధారాలను మార్చవద్దని అవినాష్ రెడ్డికి సూచించారు.

మరోవైపు ఈ కేసులో అవినాష్ రెడ్డిని ఎనిమిదో నిందితుడిగా చేర్చినట్లు సీబీఐ తాజాగా కోర్టుకు తెలియజేసింది. అవినాశ్రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ను వ్యతిరేకిస్తూ కోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లో సీబీఐ ఈ విషయాన్ని వెల్లడించింది.

కాగా వివేకా హత్య కేసులో సీబీఐ అవినాష్ రెడ్డిని నిందితుడిగా పేర్కొనడం ఇదే తొలిసారి. అంతకుముందు సీబీఐ ఎంపీని సహ నిందితుడిగా మాత్రమే పేర్కొంది. అవినాష్ రెడ్డి భాస్కర్ రెడ్డి ఇద్దరూ కలిసి వివేకా ఇంటిలో సాక్ష్యాధారాలను ధ్వంసం చేశారని సీబీఐ ఆరోపించింది.

వివేకానంద రెడ్డి మార్చి 15 2019న పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. సాక్ష్యాధారాలు ధ్వంసం కావడంలో అవినాష్ రెడ్డి ఆయన తండ్రి పాత్ర ఉందని సీబీఐ కోర్టుకు తెలిపింది. సాక్షులను ప్రభావితం చేసేందుకు వీరిద్దరూ ప్రయత్నిస్తున్నారని పేర్కొంది.

శివశంకర్ రెడ్డి ఫోన్ చేసిన వెంటనే అవినాష్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారని కూడా సీబీఐ కోర్టుకు తెలిపింది. కేసు బుక్ చేయవద్దని పోస్టుమార్టం చేయొద్దని పోలీసు అధికారి శంకరయ్యకు అవినాష్ రెడ్డి శివశంకర్ రెడ్డి చెప్పారని నిందితుడిగా మారిన దస్తగిరి తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు.

భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ను వివేకానందరెడ్డి కుమార్తె సునీత నర్రెడ్డి కూడా వ్యతిరేకించారు. బెయిల్ పై విడుదలైతే నిందితులు దర్యాప్తును సాక్షులను ప్రభావితం చేయగలరని ఆమె న్యాయవాది కోర్టుకు నివేదించారు.

# దీర్ఘకాల కొవిడ్ క్యాన్సర్ తో సమానమట



ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారి ఎంతటి ప్రమాదకరమైన విషయం.. దానిపై పరిశోధనలు చేస్తున్న క్రమంలో బయటకు వస్తున్నాయి. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్న వేళ.. కొత్త విషయాల్ని గుర్తిస్తున్నారు. కొవిడ్ బారిన పడినోళ్లకు ఉన్న ముప్పు.. తీవ్రత ఎక్కువగా ఉండి.. దీర్ఘకాలం ఇబ్బంది పెట్టిన వారి విషయంలో కొవిడ్ చేసిన నష్టం ఎంతన్న విషయంపై అధ్యయనం చేస్తున్న వేళ.. షాకింగ్ నిజాలు బయటకు వస్తున్నాయి.

ఈ క్రమంలో ఇటీవల నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ కేర్ రీసెర్చ్ జర్నల్ లో ఒక కథనం ప్రచురితమైంది. ఇందులో దీర్ఘకాలం కొవిడ్ తో బాధ పడిన 3750 మంది రోగులపై యూనివర్సిటీ ఆఫ్ లండన్.. యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెటర్ కు చెందిన వైద్య పరిశోధకులు పరిశోధనలు చేపట్టారు.

కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత వారి ఆరోగ్యంలో ఏ విధమైన మార్పులు చోటు చేసుకున్నాయన్న అంశంపై ఈ టీం పరిశోధన చేసింది. ఎంపిక చేసుకున్న కొవిడ్ బాధితుల నుంచి సమాధానాల్ని ఆన్ లైన్ ద్వారా రాబట్టిన.. అనంతరం వారిచ్చిన సమాచారాన్ని విశ్లేషించారు.

దీర్ఘకాలిక కొవిడ్ తో బాధ పడిన వారిలో ఎక్కువమంది అలసటతో బాధ పడుతున్నట్లుగా పేర్కొన్నారు. ఈ అలసట ఎంత ఎక్కువగా ఉందంటే.. ఊపిరితిత్తుల క్యాన్సర్ నాలుగో స్టేజ్ లో ఉన్నప్పుడు ఒక బాధితుడు ఎంతలా అలసటకు గురి అవుతాడో.. అంతకంటే ఎక్కువ ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు.

బాధితుల జీవితాలపై దీర్ఘకాలిక కొవిడ్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్న విషయం తాజా అధ్యయనంలో వెల్లడైందని.. దీంతో రోజువారీ పనులు చేసుకోవటానికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నట్లుగా అధ్యయనంలో పేర్కొన్నారు. ఈ అధ్యయనంలో భాగంగా సమాచారం సేకరించిన వారిలో 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మధ్య వయసులో ఉన్నవారే.

కొవిడ్ తర్వాత.. గతంలో మాదిరి తాము పని చేయలేకపోతున్న విషయాన్ని 51 శాతం మంది పేర్కొనటం గమనార్హం. అందులో 20 శాతం అయితే.. పూర్తిగా పని చేయలేకపోతున్నట్లు చెప్పారు. ఇదంతా ఒక ఎత్తు అయితే తమ వివరాల్ని వెల్లడించిన కొవిడ్ బాధితుల్లో 71 శాతం మంది మహిళలే ఉన్నట్లుగా ఈ అధ్యయనానికి లీడ్ చేసిన డాక్టర్ హెర్నీ గుడ్ ఫెలో పేర్కొన్నారు. ఏమైనా.. దీర్ఘకాలిక కొవిడ్ తో ఇబ్బంది పడే వారు ఆరోగ్యం విషయంలో మరిన్నిజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

# గ్రంధాలయంలో ఐక్యమత్యమే మహాబలం అనే అంశంపై అవగాహన



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకరరావు ఐక్యమత్యమే మహాబలం అన్న అంశంపైకథ రూపంలో వివరించారు. ఐక్యమత్యంతో కలసి ఆడవలసిన ఆటల గురించి తెలిపారు. అనంతరం పిల్లలచేత కూడా అటువంటి గేమ్స్ ఆడించారు. సిహెచ్.భవానీ(డబ్లూడబ్ల్యూపిఎస్) స్పోకెన్ ఇంగ్లీష్పై అవగాహన కల్పించారు. గ్రంధాలయధికారిని పి.దమయంతి సమ్మర్ క్యాంపు సందర్భంగా డిపాజిట్ దారులుగా 80 మందిని చేర్పించారు. దీనిలో పిల్లలు 53 మంది, మహిళలు 9, పురుషులు 18 మంది చేర్చడం జరిగిందన్నారు. ప్రతి ఆదివారం జరిగే చిల్డ్రన్స్ క్లబ్‌లో పాల్గొనాలని కోరారు. పిల్లలందరకి ఓఆర్ఎస్ ద్రావణన్ని, బిస్కెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో 32 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

# కుమారుడిని మింగేసిన సొరచేప... తండ్రి చూస్తుండగానే..



అడవిలో సింహాలు పులులు ఎంత క్రూర మైనవో ప్రమాదకర మైనవో సముద్రంలో షార్క్స్ కూడా అంతే ప్రమాదకర మైనవి. ఈ సొర చేపలు మనుషులను పూర్తిగా మింగేసిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే వీటి జోలికి వెళ్తేనే ఇవి దాడి చేస్తాయి. అందుకే సముద్ర ప్రయాణాలు చేసే వారు వీటికి మరీ దగ్గరగా వెళ్లాలి అనుకోరు. చేపలు పట్టేవారు వీటి పట్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

ఎందుకంటే అవి ఎప్పుడు ఏ వైపు నుంచి ఎలా దాడి చేస్తాయో ఊహించడం చాలాకష్టం. అందుకే సముద్రాలపై వెళ్లేవారు సొర చేపలను చూస్తేనే అమడ దూరం పారిపోతున్నారు. అయితే తాజాగా ఓ మనిషిని సొర చేప మింగిన వీడియో వైరల్ గా మారింది.

అసలు ఏం జరిగిందంటే... ఈజిప్ట్ లోని ఎర్ర సముద్రం రిసార్ట్ లో ఓ యువకుడు ఈత కొడుతున్నాడు. ఆ సమయంలో సొరచేప అతడిపై దాడి చేసింది.

దాని నుంచి తప్పించుకునేందుకు యువకుడు తీవ్రంగానే ప్రత్నించాడు. తనను వెంటాడుతున్న సొర నుంచి తప్పించుకునేందుకు వేగంగా ఈదడం ప్రారంభించాడు. కానీ సొర చేప అంతే వేగంగా వచ్చి అతడిని నీటిలోకి పట్టుకెళ్లి పోయింది.

ఇక ఈ ఘటన జరిగిన సమయంలో యువకుడి తండ్రి అక్కడి నుంచి దగ్గరలోనే ఉన్నాడు. కుమారుడిపై సొర దాడి చేయడం చూసిన తండ్రి వెంటనే బోటులో అతని దగ్గరికి వెళ్లాడు. కానీ అతడు వచ్చేసరికి సొర చేప యువకుడిని నీటి లోపలికి లాక్కెళ్లిపోయింది.

తండ్రి కళ్ల ముందే కొడుకును మింగేసింది ఆ సొర చేప. కాగా మృతుడిని రష్యాకు చెందిన వ్లాది మిర్ పొపొవ్ గా అధికారులు గుర్తించారు. కొడుకు మృతితో తండ్రి బోరున విలపిస్తున్నాడు. అతని కుటుంబం విషాదంలోకి మునిగి పోయింది. ఇక ఈ విషయాన్ని హుర్ఘదా లోని రష్యన్ కాన్సు లేట్ వెల్లడించింది. అయితే ఈ సంఘటన అంతా వీడియోలో రికార్డు చేశారు. అది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# రైతులకు వరి విత్తనాలు పంపిణీ.. ఎంపీపీ పైలా



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయధికారిని సిహెచ్ చంద్రావతి అధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస్, మరియు వ్యవసాయ సలహా మండల చైర్మన్ కోన రామారావు పాల్గొని రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. వ్యవసాయాధికారిణి మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ ను గాను వరి విత్తనాలు బి.పి.టి-5204 (సాంబమసూరి) రకం 80 క్వింటాళ్ళు, ఆర్.జి.ఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం 80 క్వింటాళ్ళు, ఎం.టి.యు-1224 (మార్టేరు సాంబ) రకం 5 క్వింటాళ్ళు, మరియు ఆర్.ఎన్.ఆర్-15048 (తెలంగాణ సోన) రకం 2 క్వింటాళ్ళు వివధ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ వరి విత్తనాలపై కేజికి పది రూపాయలు రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ విత్తనాలు కావలసిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రిజిస్టర్ చేసుకొని పొందగలరని తెలియజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులందరూ ఆర్బీకే ల ద్వారా రాయితీ విత్తనాలు పొందాలని సూచించారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ రైతులు తమ సొంత విత్తనాలు కాకుండా నాణ్యత నిర్ధారించబడిన వ్యవసాయ శాఖ వద్ద ఉన్న విత్తనాలు వాడి అధిక దిగుబడులు పొందగలరని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండల వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రామునాయుడు , సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు , వ్యవసాయ సలహా మండలి సభ్యులు బండారు రాజశేఖర్, మండల జె సి ఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, కన్నూరు అయ్యబాబు, గెడ్డం రమణ, గోక్యాడ జానకిరాం, వెన్నెల సన్యాసి రావు, బొండా ప్రసాద్, చుక్క అప్పలనాయుడు మరియు రైతులు పైల హరీష్, గండి కృష్ణ, రెడ్డి చంటి, పైల కుమారి, వ్యవసాయ విస్తరణాధికారులు పి.సంజీవరావు, ఎం.ఎస్.మూర్తి , గ్రామ వ్యవసాయ సహాయకులు గౌతమి, అనిత, అనూష, జ్యోతి, జాస్మిన్ పాల్గొన్నారు.

## మృతదేహాలు ఉంచిన స్కూల్ భవనం కూల్చివేత



ఒడిశాలోని బాలేశ్వర్ లో ట్రిపుల్ ట్రైన్ ప్రమాదంలో చనిపోయిన మృతదేహాలను బహంగాలోని ఓ హైస్కూల్ లో తాత్కాలికంగా ఉంచారు. మూడు నాలుగు రోజుల పాటు ఈ పాఠశాల శవాగారంగా మారింది! ఆ తర్వాత ఇక్కడి మృతదేహాలను భువనేశ్వర్ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత స్కూల్ ను శుభ్రం చేశారు. కానీ ఈ పాఠశాలలోకి రావడానికి విద్యార్థులు భయపడుతుండటంతో దీనిని కూల్చివేశారు.

ఇక్కడ ఒకేచోట మృతదేహాలను చూసి స్థానికులు భయానికి గురవుతున్నారు. ఈ ప్రదేశానికి రావడానికే జంకుతున్నారు. ఈ స్కూల్ ను 16వ తేదీన తిరిగి ఓపెన్ చేయనున్నారు. అయితే ఈ పాఠశాలకు రావడానికి విద్యార్థులు ధైర్యం చేయడం లేదని, వారి తల్లిదండ్రులు కూడా చిన్నారులను పంపించేందుకు నిరాకరిస్తున్నారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. అంతేకాదు అరవై ఐదు సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం కూడా పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో ఈ స్కూల్ ను కూల్చివేయాలని పాఠశాల యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరింది.

బాలాసోర్ జిల్లా కలెక్టర్ గురువారం ఈ స్కూల్ ను పరిశీలించారు. అనంతరం కూల్చివేతకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో శుక్రవారం ఈ భవనాన్ని కూల్చి వేశారు. ఇదే చోట కొత్త భవనాన్ని నిర్మిస్తామని, అప్పుడు విద్యార్థులు వస్తారని స్కూల్ యాజమాన్యం చెబుతోంది.

## ఇంటివాడైన జబర్దస్త్ కెవ్వు కార్తీక్



తెలుగు ప్రజలకు జబర్దస్త్ కామెడీ షో ద్వారా పరిచయం అయ్యాడు కెవ్వు కార్తీక్. తనదైన శైలిలో స్కిట్ లను చేస్తూ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు చేసుకున్నాడు. మిమిక్రి ఆర్టిస్ట్ గా తన కెరీర్ మొదలుపెట్టిన కార్తీక్.. జబర్దస్త్ లో ఆర్టిస్ట్ గా అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం టీం లీడర్ గా చేస్తున్నాడు. ప్రస్తుతం పలు సినిమాలు, షోలతో బిజీగా ఉన్నాడు కెవ్వు కార్తీక్. ఇటీవలే తాను ఓ అమ్మాయిని వివాహం చేసుకోబోతున్నాడని ప్రకటించారు.

శ్రీలేఖ అనే అమ్మాయితో కార్తీక్ వివాహం ఘనంగా జరగగా.. ఆ వేడుకకు పలువురు టీవీ నటులు, టెక్నీషియన్స్, జబర్దస్త్ కమెడియన్స్, సినీ ప్రముఖులు కూడా విచ్చేశారు. దాంతో కెవ్వు కార్తీక్ పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అలానే పలువురు అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియాలో కొత్త దంపతులకు కంగ్రాట్స్ చెప్తున్నారు.

ఇటు బుల్లితెర నుంచి కూడా పులువురు ఆర్టిస్ట్ లు హాజరై పెళ్ళి వేదికపై సందడి చేశారు. అందుకు సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలు చూసి నెటిజన్స రకరకాల కమెంట్లు పెడుతున్నారు. ముఖ్యంగా కొత్త జంట కు శుభాకాంక్షలు చెబుతూ.. మెసేజ్ లు పెడుతున్నారు.

## మృతుడి కుటుంబానికి వైయస్సార్ బీమా ను అందజేసిన కెల్లా



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 13వ వార్డు, సచివాలయం-8 జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, శ్రీకాంత్ నగర్ లో నివాసముంటున్న రామభక్త రఘు(45) అనే వ్యక్తి కిడ్నీ సంబంధిత వ్యాధితో గురువారం మరణించడం జరిగింది. వైయస్సార్ బీమా పథకంలో భాగంగా మృతుడు కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయంలో భాగంగా 10 వేల రూపాయలు వార్డు అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ చేతుల మీదగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ రామకృష్ణ, వాలంటీర్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్లి వీర్రాజు,రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా సభకు పవన్ కల్యాణ్ ను పిలవకపోవడానికి కారణం ఇదే: సీఎం రమేశ్

ఈ నెల 11న విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభ ఉన్న సంగతి తెలిసిందే. దీనిపై బీజేపీ నేత సీఎం రమేశ్ మాట్లాడుతూ, 9 ఏళ్ల మోదీ పాలనలో బీజేపీ సాధించిన విజయాలను అమిత్ షా వివరిస్తారని చెప్పారు. ఇది పూర్తిగా పార్టీపరమైన సభ అని... అందుకే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఆహ్వానించలేదని తెలిపారు. రేపు తిరుపతిలో బీజేపీ బహిరంగ సభ జరుగుతోందని... తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ సభకు హాజరవుతారని చెప్పారు.

అమిత్ షాతో టీడీపీ అధినేత చంద్రబాబు సమావేశం కావడంపై సీఎం రమేశ్ స్పందిస్తూ... అమిత్ షాతో చాలా మంది నేతలు సమావేశమవుతారని అన్నారు. వారి సమావేశం గురించి అమిత్ షా కానీ, చంద్రబాబు కానీ మాట్లాడితేనే బాగుంటుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో బీజేపీ భాగస్వామ్యం ఉన్న ప్రభుత్వమే వస్తుందని అన్నారు. పొత్తులపై పార్టీ హైకమాండ్ సరైన సమయంలో, సరైన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## ఆటోని అచ్చం కారులా మార్చేసుకున్న ఆటోడ్రైవర్




సృజనాత్మకత, పట్టుదల ఉంటే చాలు. తమకు నచ్చినట్టుగా మార్చుకోవచ్చని నిరూపించాడు ఓ ఆటో డ్రైవర్. కారు వేరు, ఆటో వేరు. కారు ప్రయాణానికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అందులోని సీటింగ్ మంచి కుషన్ తో విశాలంగా, మెత్తగా ఉంటుంది. దాంతో ఎంత దూరం ప్రయాణించినా అలసట తెలియదు. అదే ఆటో అయితే అలా కాదు. మంచి రహదారులపై అయితే ఫర్వలేదు కానీ, గతుకుల రోడ్లపై ఆటోలో ప్రయాణిస్తే ఒళ్లు గుల్ల అవుతుంది. ఎందుకంటే ఆటో సీటింగ్ అంత సౌకర్యంగా ఉండదు.

అందుకే, బెంగళూరుకు చెందిన ఓ ఆటో డ్రైవర్.. తన ఆటోని కారులా ఎందుకు మార్చుకోకూడదు? అని అనుకున్నాడు. కొంచెం ఖర్చు అయినా ఫర్వాలేదు అనుకుని ఆటోని కారుగా మార్చేసుకున్నాడు. ఆటో లోపల కారు మాదిరి మెత్తటి సీట్లు, లైటింగ్, డోర్లు ఏర్పాటు చేయించాడు. బయటి నుంచి చూస్తే ఆటో మాదిరే ఉంటుంది. కానీ లోపల కూర్చుంటే కారు అనుభూతి కలుగుతుంది. తన ఆటో ఎక్కే ప్రయాణికుల కోసం అతడు చేసిన ఆలోచనను నిజంగా అభినందించాల్సిందే. ఈ ఆటో వీడియోని అజిత్ సహాని అనే ట్విట్టర్ యూజర్ షేర్ చేశాడు.

## తిరుమల ఘాట్‌లో కొండను ఢీకొట్టిన టెంపో



ఇటీవల కాలంలో తిరుమల ఘాట్ రోడ్లపై వరుసగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడు వారాల వ్యవధిలో నాలుగో ప్రమాదం చోటుచేసుకుంది. ఇవాళ రెండో ఘాట్ రోడ్డులో తిరుపతి నుంచి తిరుమల వెళుతున్న ఓ టెంపో వాహనం కొండను ఢీకొట్టింది. ఓ బస్సును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఈ ఘటన జరిగింది. సేఫ్టీ వాల్, రెయిలింగ్ లేకపోవడంతో టెంపో నేరుగా కొండను తాకింది. ప్రమాద సమయంలో టెంపోలో డ్రైవర్ తప్ప ఎవరూ లేరు. కొండను ఢీకొట్టిన నేపథ్యంలో టెంపో ముందుభాగం ధ్వంసమైంది. వరుస ప్రమాదాలపై టీటీడీ పాలకవర్గం సమీక్ష చేపట్టి, సూచనలు చేసిన వారంలోపే ఘటన జరగడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

## టౌన్ ప్లానింగ్ పిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ - 8187897569



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి పరిధిలో ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగంలో పిర్యాదులు అధికంగా వస్తున్న నేపద్యంలో జివిఎంసి కమీషనర్ సి ఎం సాయికాంత్ వర్మ టౌన్ ప్లానింగ్ పిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం" కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా అధికంగా పట్టణ ప్రణాళిక విభాగపు ఆధ్వర్యంలో డిసిపి నరేంద్రనాథ్ రెడ్డి, ఎసిపిలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబుల్యూపిఆర్ఎస్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం" కార్యక్రమంలో జోన్ %--% 2(01), జోన్ %--% 4 (01), జోన్ %--% 5 (05), జోన్ %--% 6(06), జోన్ %--% 8(03), మొత్తం%--% 16 పిర్యాదులు అందినట్లు కమీషనర్ ఒక ప్రకటనలో తెలియజేసారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నటువంటి ఎనిమిది జోన్లలో ఎలాంటి అనాధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపై, టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎలాంటి పిర్యాదుల గురించి తెలియజేయాల న్నా, జివిఎంసిలో ఉన్న టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ : 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తమ సమస్యను తెలియజేయవచ్చు మరియు జివిఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "వాట్సాప్ నంబర్ : 81878 97569"కు వారి యొక్క మొబైల్ నుండి తమ పిర్యాదులను పూర్తి వివరములతో అనగా పేరు, డోర్ నెంబర్, వార్డ్ నెంబర్, చిరునామా మరియు సమస్య యొక్క వివరములను వాట్సాప్ పంపిన యెడల వాటిని సంబందిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, ఆ సమస్య పై సత్వర చర్యలు చేపడతామని తెలిపారు.

# విధుల్లో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు



**బత్తిలి/పార్వతీపురం:** విధుల్లో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. భామిని మండలం బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులలో స్వల్ప తేడాలు గమనించిన జిల్లా కలెక్టర్ ఇకపై రికార్డుల నమోదు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఇకమీదట ఇలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది హాజరులో భాగంగా జూనియర్ అసిస్టెంట్ శశికాంత్ బహదూర్ ను గూర్చి వాకాబు చేయగా ట్రెజరరీ ఆఫీసుకు వెళ్లారని తెలియజేయగా, ట్రెజరరీ ఆఫీసుకు ఫోన్ లో వివరాలు అడిగారు. హాస్పటల్ సిబ్బంది ఎవరూ ట్రెజరీకి రాలేదు అని నిర్ధారించడంతో జీతం నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశించారు. నైట్ వాచ్ మాన్ వెంకటరావు గత 8 మసాల నుండి విధులకు రాకపోవడం గమనించిన కలెక్టర్ తగిన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గత 6 మసాలగా 15 మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్స్ జరగడానికి గల కారణాలను ప్రశ్నించారు. శానిటేషన్, ఆపరేషన్ గది, ఓపి కార్డ్స్ క్షున్నంగా పరిశీలించారు. ప్రతీ శుక్రవారం ప్రభుత్వం నిర్దేశించిన గ్రామాలకు శానిటేషన్ చేయవలసి వుండగా ఇంతవరకు ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. గత 6 మసాలా నుండి ఒక్క ప్రసవం కూడా జరగక పోవడంపై ఆరా తీయగా సరైన సమాధానం చెప్పక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట ఇలా జరగకుండా చూసుకోవాలని డాక్టరు రవీంద్రను హెచ్చరించారు. ఆసుపత్రి ప్రసవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రసవ తేదీలను తెలియజేసి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రక్త హీనత కలిగినవారిపై పౌష్టికాహారం గూర్చి తెలియజేయాలని ఆయన సూచించారు. ఫ్యామిలీ డాక్టరు వైద్య ఆరోగ్య సేవలు పక్కాగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. అంటు వ్యాధులు, అంటువ్యాధులు కాని బిపి, మధుమేహం వంటి వాటిపై అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. రానున్న వర్షాకాలంలో దోమలు ఎక్కువగా ప్రభల కుండా స్ప్రేయింగ్ పక్కాగా జరిగే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది మంచి వైద్యం అందించాలని సూచించారు. దూర ప్రాంతాల నుండి ప్రజలు వస్తారని వారికి వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావించాలని ఆయన పేర్కొన్నారు.

**పాఠశాల పనులు వేగవంతం చేయాలి**

నాడు నేడు పనులు జరుగుతున్న పాఠశాల భవనాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుపడితే 10 వేలు జరిమానా



పరవాడ, (విశాఖ సమాచారమ్): వాహనదారులందరికీ పరవాడ పోలీసు హెచ్చరిక ఇక మీదట మద్యం సేవించి వాహనాన్ని నడిపి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడితే 10వేల రూపాయలు జరిమానా లేదా వారం రోజులు జైలు శిక్ష విధించబడునని అనకాపల్లి క్లాస్ 2 మెజిస్ట్రేట్ పత్రికా పూర్వకంగా తెలిపారని సీఐ పి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు అన్ని రికార్డులను వెంటపెట్టుకొని వాహనాలు నడపాలని అన్నారు.

## పాదగయ క్షేత్రంలో బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ట్రేస్ చేసి బ్యాగ్‌ను అందజేసిన పోలీసులు



పిఠాపురం, (విశాఖ సమాచారమ్): పాదగయ క్షేత్రం వద్ద భక్తులు పోగొట్టుకున్న .బ్యాగ్ ను మహిళకు పోలీసులు ట్రేస్ సేసిఆటో యూనియన్లను అలెర్ట్ చేసి సదరు మహిళకు బ్యాగ్‌ను కొన్ని గంటల సమయంలో అందించిన పిఠాపురం టూరిస్ట్ పోలీసులు, పోలీస్ సేవలను మెచ్చుకుంటూ పట్టణ ప్రజలు బాధిత మహిళ సందర్శనార్థం వచ్చిన భక్తులు పోలీసుల సేవలను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

# అన్ని జిల్లాల్లో జ్యోతిరావు పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలి

### ఆల్ ఇండియా బీసీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు పోతల ప్రసాద్ నాయుడు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అన్ని జిల్లాలలో జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమవంతు సహాయ సహకారాలు అందించాలని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని ఆల్ ఇండియా బీసీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు కోరారు. అమరావతిలో విజయసాయిరెడ్డిని ఆయన కలిసి ఈ మేరకు కోరారు. అంతేగాక అనకాపల్లి జిల్లాలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు స్థలాన్ని కేటాయించమని విజయసాయి రెడ్డి ని కోరినట్టు తెలిపారు. అనంతరం విజయ సాయి రెడ్డితో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని నేరుగా కలిసి జ్యోతిరావు పూలే విగ్రహాలను అన్ని జిల్లాల హెడ్ క్వార్టర్ లో నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ,బీసీల యొక్క ఆత్మ గౌరవం పెంచే విధంగా సంఘ సంస్కర్త బిసి ఉద్యమ నేత పూలే విగ్రహాలను అన్ని జిల్లాల హెడ్ క్వార్టర్ల ఏర్పాటు చేయాలని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి మాకు



స్థలాన్ని కేటాయిస్తే తామే విగ్రహాలను నిర్మించుకుంటామని తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమం అనకాపల్లి జిల్లా నుంచి ప్రారంభించే విధముగా ప్రభుత్వం నుంచి మీ సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైయస్సార్ పార్టీ అనుబంధ సంస్థల ఇన్చార్జిగా ముఖ్య నేతగా గుర్తింపు పొందిన తమరు పార్లమెంట్లో బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఇప్పటికీ కేవలం 27% రిజర్వేషన్ బీసీలకు అమలు అవుతుందని బీసీలు తరపున మా వాదనను గట్టిగా వినిపించిన మీ సేవలను బీసీలు గుర్తించుకుంటారని దయచేసి జ్యోతిరావు పూలే విగ్రహాలు ఏర్పాటుకు అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి మరొకసారి మీరు బీసీ పక్షపాతిగా మా బీసీల్లో ధైర్యం నింపాలని పోతల ప్రసాద్ కోరారు. రాష్ట్ర బీసీ అసోసియేషన్ ,జాతీయ అధ్యక్షులు పాతల ప్రసాదనాయుడును రాష్ట్ర బీసీ నేతలు ఆడారి కుమారస్వామి పినబోయిన అప్పారావు యాదవ్ , కె ఎం నాయుడు తదితరులను ఈ సందర్భంగా. విజయ సాయి రెడ్డి అభినందించారు

# వేద కాలం నాటి బ్యాంకింగ్ వ్యవస్థ

ప్రపంచపు మొదటి బ్యాంకింగ్ వ్యవస్థ గురించి విద్యార్థులకు క్లాసు పూర్తి చేసిన తర్వాత ఒకసారి శర్మగారు బ్యాంకింగ్ సంబంధించిన సందేహాలు ఉన్నట్లయితే అడగమని చెప్పారు.

ఒక విద్యార్థి లేచి ప్రపంచంలో పురాతనమైన బ్యాంకింగ్ వ్యవస్థ బ్రిటిష్ బ్యాంకింగ్ వ్యవస్థ ఏనా అని అడుగుతాడు.

దానికి చిరునవ్వుతో శర్మగారు ఇలా సమాధానం చెప్పారు.

ప్రపంచపు తొలి బ్యాంకింగ్ వ్యవస్థ భారతదేశం లోనే ఉంది.

ఆంధ్రప్రదేశ్లో మన తిరుపతి నగరమే దానికి మూలస్థానం

ద ఫస్ట్ బ్యాంకింగ్ ట్రాన్సేక్షన్ :

కలియుగ ప్రారంభంలో వెంకటేశ్వర స్వామి కుబేరుడి దగ్గర అప్పు తీసుకున్నాడు.సుమారు 5000 సంవత్సరాల క్రితం జరిగినటువంటి ఈ బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్ ప్రపంచ మొదటి బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్ గా చెప్పుకోవచ్చు.

ద ఫస్ట్ బ్యాంకర్:

శ్రీనివాసడికి అప్పిచ్చిన కుబేరుడిని మించిన బ్యాంకర్ ఎవరున్నారు.

ద ఫస్ట్ ప్రామిసరీ నోట్:

కుబేరుడికి శ్రీనివాసుడు రాసిన ప్రామిసరీ నోట్ ప్రపంచంలోని

ద ఫస్ట్ బిల్ ఆఫ్ ఎక్స్చేంజ్:

మొట్టమొదటి బిల్ ఆఫ్ ఎక్స్చేంజ్ అని చెప్పుకోవచ్చు.

ద గుడ్ లోన్ రీపేమెంట్:

శ్రీనివాసునికి ఉన్న వడ్డీ కాసులవాడు అనే పేరు అప్పటికే ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థని ఋజువు చేస్తుంది.

తను సంపాదించి క్రమం తప్పకుండా లిలోన్ రిపేమెంట్‌లి చేస్తున్న ఆ వెంకటేశ్వర స్వామి అప్పు తీసుకున్న వారందరికీ ఆదర్శవంతుడు.

ఇలా ఈనాడు మనం చెప్పుకుంటున్న చెలామణి లో ఉన్న ఎన్నో పథకాలు ఆ కాలంలోనే అమలు జరిగాయి.

ద ఫస్ట్ లీజ్ అగ్రిమెంట్:

వరాహ స్వామి దగ్గర స్థలం లీజుకి తీసుకుని

ద ఫస్ట్ మార్టేజ్:

ఆ లీజ్ హెూల్డ్ రైట్స్ మీద శ్రీనివాసుడు కుబేరుడి దగ్గర అప్పు తీసుకున్నాడు.

ద ఫస్ట్ ఇన్‌కం సోర్స్ సర్టిఫికేట్:

తనకి రాబోయే ఆదాయం హామీగా చూపించాడు. అంటే అసైన్మెంట్ ఆఫ్ ఫ్యూచర్ ఇన్కమ్ అన్నమాట.

కుబేరుడిని మించిన బ్యాంకరు, శ్రీనివాసుని మించిన హై క్రెడిట్ రేటింగ్ బారోయరు ప్రపంచంలో ఎక్కడ ఉంటారు?

ఇలా బ్యాంకింగ్ సంబంధించిన ఎన్నో విషయాలు మనకి తెలియజేసే తిరుపతిని ప్రతి బ్యాంకు ఉద్యోగి తప్పకుండా తెలుసుకోవాలి అని శర్మ గారు తన సమాధానం పూర్తి చేయగానే విద్యార్థులందరూ ఆశ్చర్యంగా, వేద కాలం నాటి బ్యాంకింగ్ వ్యవస్థ - ఈనాటి బ్యాంకింగ్ వ్యవస్థ ఒకటే కదా అని గోవిందా గోవిందా అంటూ గోవింద నామస్మరణ చేశారు.

గోవింద నామస్మరణతో క్లాస్ అంతా ప్రతిధ్వనించింది.

# ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలి

**విజయనగరం:** పేదలందరికీ సొంత ఇళ్లు ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు. చీపురుపల్లి డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో నిర్దేశిత లక్ష్యాలు చేరుకునేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయ కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే నాడు నేడు పనుల్లో ఆశాజనక ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో నాడు - నేడు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులపై శుక్రవారం చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పలు అంశాలపై ఆమె మార్గ నిర్దేశకాలు జారీ చేశారు. వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకునేందుకు ప్రణాళికాయుత కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె మండలాల వారీగా అధికారులను, సచివాలయం ఇంజీరింగ్ అసిస్టెంట్లు లేపి అక్కడ సాధించిన ప్రగతి గురించి ఆరా తీశారు. నివేదికలను పరిశీలించి తగు సూచనలు చేశారు. వారం వారం స్టేజ్ అప్డేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అవసరం అనుకుంటే లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రోత్సహం అందించాలని చెప్పారు. ఇటీవల వచ్చిన కొత్త డి.పి.ఆర్.కు అనుగుణంగా పని చేయాలని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. రాజాం నియోజకవర్గ పరిధిలో 85 శాతం

లక్ష్యాలను మాత్రమే చేరుకున్నారని.. ఇది సరిపోదని శత శాతం చేరుకోవాలని నిర్దేశించారు. తక్కువ పురోగతి సాధించిన గ్రామాల్లో మరొకసారి అన్ని విభాగాల అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒక సారి నూతన లక్ష్యాలు వస్తాయని వాటికి అనుగుణంగా అందరూ పని చేయాలని సూచించారు.

నాడు - నేడు మన బడి పథకంలో భాగంగా



చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, టాయ్లెట్, కిచెన్ షెడ్స్ పనులను వీలైనంత వేగంగా ముగించాలని చెప్పారు. జిల్లాలో 390 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ కిట్ ఏర్పాటు చేయాల్సి ఉంది కాబట్టి సంబంధిత పనులను ముందుగా చేయాలని సూచించారు.

పంచాయతీ రాజ్ విభాగం పరిధిలో చేయాల్సిన పనులను త్వరితగతిన ముగించాలని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సరిగ్గా నిర్వహించాలని సూచించారు. నాడు - నేడు పనులు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పనులు పూర్తి అయినా వెంటనే బిల్లులు అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు.

**నాడు-నేడు ఉపకరణాలను స్థానికంగా కొనుగోలు చేసుకోండి**

పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు-నేడు పనుల్లో భాగంగా అవసరమైన విద్యుత్, టాయ్లెట్, టైల్స్ ఉపకరణాలను స్థానికంగా కొనుగోలు చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇండెంట్ పెట్టుకొని నిబంధనలు ప్రకారం వస్తువులను కొనుగోలు చేసుకొని పనులను వేగంగా ముగించాలని చెప్పారు. వీటికి సంబంధించి ఆర్థిక వనరులను ముందుగానే చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

సమావేశంలో చీపురుపల్లి ఆర్డీవో అప్పారావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. రమణ మూర్తి, డి.ఈ.వో. లింగేశ్వర రెడ్డి, అన్ని మండలాల ఎంపీడీఓలు, గృహ నిర్మాణ, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కెవిఐసి అద్భుత ప్రగతి





**విజయవాడ (పీఐబీ):** ఖాదీ & గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ), గౌరవనీయ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, 'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్'ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లడం ద్వారా బలమైన భారతదేశ అందమైన ముఖచిత్రాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా ఖాదీ & గ్రామ పరిశ్రమల కమిషన్ ఉత్పత్తుల టర్నోవర్ రూ.1.34 లక్షల కోట్లను దాటింది. గత 9 ఆర్థిక సంవత్సరాల్లో, గ్రామీణ ప్రాంత చేతివృత్తి కళాకారులు ఉత్పత్తి చేసిన దేశీయ ఖాదీ ఉత్పత్తుల విక్రయాల్లో అద్భుతమైన 332% వృద్ధి నమోదైంది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఖాదీ & గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల టర్నోవర్ రూ.31,154 కోట్లు కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.1,34,630 కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు సాధించిన అత్యుత్తమ వృద్ధి ఇది. అదే విధంగా, గ్రామీణ ప్రాంతాల్లో 9,54,899 కొత్త ఉద్యోగాలను సృష్టించడం ద్వారా కేవీఐసీ కొత్త మైలురాయిని అధిగమించింది.

మహాత్మాగాంధీ నిజమైన స్ఫూర్తి, గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'బ్రాండ్ శక్తి', మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న చేతివృత్తుల వారి అలుపెరగని కృషికి ప్రతిఫలంగా దక్కిన ఘనత ఇది అని కేవీఐసీ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ అభివర్ణించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, దేశవిదేశాల్లోని ప్రతి వేదికపై ఖాదీ గురించి ప్రచారం చేశారని, ఆ కారణంగా ఖాదీ ప్రజాదరణ కొత్త శిఖరానికి చేరుకుందని అన్నారు. ఇప్పుడు, ప్రపంచంలోని అత్యంత విశ్వసనీయ బ్రాండ్‌లలో ఒకటిగా ఖాదీ ఉత్పత్తులు నిలిచాయి. 2013-14 నుంచి 2022-23 వరకు ఆర్థిక సంవత్సరాల్లో, కేవీఐసీ వస్త్రోత్పత్తుల్లో 268% అసాధారణ పెరుగుదల ఉంది. అమ్మకాలు గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి 332% వృద్ధితో శిఖరంపై నిలిచాయి. 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్', 'స్వదేశీ ప్రొడక్ట్స్'పై ప్రజల్లో విశ్వాసం పెరిగిందనడానికి ఇదే నిదర్శనం.

కేంద్రంలోని 'మోదీ ప్రభుత్వం' 9 సంవత్సరాల పాలనలో, ఖాదీకి నూతన జవసత్వాలు అందించిన కేవీఐసీ కృషి కారణంగా 'స్వయంసమృద్ధి నుంచి శ్రేయస్సు' వంటి 9 రికార్డులు సాధ్యమయ్యాయి.

1. కేవీఐ వస్త్రోత్పత్తుల్లో అసాధారణ వృద్ధి - 2013-14 ఆర్థిక సంవత్సరంలో కేవీఐ ఉత్పత్తుల విలువ రూ.26,109 కోట్లుగా ఉంటే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 268% అసాధారణ వృద్ధితో రూ.95957 కోట్లకు చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కేవీఐసీ చేసిన అద్భుత కృషికి ఈ ఉత్పత్తి సంఖ్యలే బలమైన రుజువు.

2. కేవీఐ ఉత్పత్తుల అమ్మకాల్లో భారీ వృద్ధి - గత 9 ఆర్థిక సంవత్సరాల్లో, అమ్మకాల ప్రాతిపదికన, కేవీఐ ఉత్పత్తులు ఏటా సరికొత్త రికార్డులు సృష్టించాయి. ఎఫ్‌వై 2013-14లో అమ్మకాలు రూ.31,154 కోట్లుగా ఉండగా, ఎఫ్‌వై 2022-23 నాటికి అపూర్వమైన 332% వృద్ధితో రూ.1,34,630 కోట్లకు చేరుకున్నాయి. ఇది, గతంలో ఎన్నడూలేని అత్యుత్తమ వృద్ధి.

3. ఖాదీ వస్త్రోత్పత్తిలో కొత్త రికార్డు - గత 9 ఏళ్లలో ఖాదీ వస్త్రోత్పత్తిలోనూ అసమాన వృద్ధి కనిపించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఖాదీ వస్త్రాల ఉత్పత్తి విలువ రూ. 811 కోట్లుగా ఉంటే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 260% వృద్ధితో రూ.2916 కోట్లను తాకింది. ఇది కూడా సంస్థ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకం.

4. ఖాదీ వస్త్రాల విక్రయాల్లోనూ కొత్త చరిత్ర - గత 9 ఆర్థిక సంవత్సరాల్లో, ఖాదీ వస్త్రాల డిమాండ్ వేగం పుంజుకుంది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో, ఖాదీ వస్త్రాల అమ్మకాలు కేవలం రూ.1081 కోట్లు మాత్రమే. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇది 450% పెరిగి రూ.5943 కోట్లను తాకింది. కొవిడ్-19 తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి సహజ దుస్తులకు డిమాండ్ పెరిగింది. దీంతో ఖాదీ వస్త్రాలకు గిరాకీ వేగంగా పెరిగింది. దీంతో పాటు, గౌరవనీయ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రతి వేదికపై ఖాదీని ప్రచారం చేయడం కూడా ఖాదీ వస్త్రోత్పత్తుల అమ్మకాలను పెంచడంలో భారీ సానుకూల ప్రభావం చూపింది.

5. ఉపాధి కల్పన & సంచిత ఉపాధి కల్పనలో నూతన రికార్డు - కేవీఐసీ ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో గరిష్ట ఉపాధి అవకాశాలను సృష్టించడం. ఈ విషయంలోనూ, గత 9 ఏళ్లలో, కేవీఐసీ రికార్డు సృష్టించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో సంచిత ఉపాధి సంఖ్య 1,30,38,444 కాగా, 2022-23లో 36% వృద్ధితో 1,77,16,288కు చేరుకుంది. అదేవిధంగా, 2013-14 ఆర్థిక సంవత్సరంలో సృష్టించిన 5,62,521 కొత్త ఉపాధి అవకాశాలతో పోలిస్తే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 70% పెరుగుదలతో 9,54,899 ఉపాధి అవకాశాలను కొత్తగా సృష్టించింది.

6. ఖాదీ కళాకారుల ఆదాయం రికార్డు స్థాయిలో పెంపు - ఖాదీ వస్త్రాల రికార్డ్ స్థాయి ఉత్పత్తి & విక్రయాల ద్వారా ఖాదీ రంగ కళాకారులు ప్రయోజనం పొందుతున్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరం నుంచి వారి వేతనాలు 150% పైగా పెరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఖాదీ కళాకారుల వేతనాలు 33% పైగా పెరిగాయి.

7. న్యూదిల్లీ కన్నాట్ ప్లేస్‌లో ఉన్న 'ఖాదీ భవన్' కొత్త రికార్డ్ - గత ఏడాది అక్టోబర్ 2న, న్యూదిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఉన్న కేవీఐసీ ప్రధాన వస్త్రాలయం 'ఖాదీ భవన్', విక్రయాల పరంగా జీవిత కాల రికార్డులను బద్దలు కొట్టింది. గౌరవనీయ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ విజ్ఞప్తి మేరకు, ఖాదీ ప్రేమికులు ఒక్క రోజులోనే రూ.1.34 కోట్ల విలువైన ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేశారు. దీంతో, కొత్త జీవిత కాల రికార్డ్ నమోదైంది.

8. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) నుంచి 'ఆత్మనిర్భర్ భారత్' సృష్టి - గౌరవనీయ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత్వమైన స్వదేశీ అభియాన్‌తో, దేశ యువతను భాగస్వాములుగా చేయడంలో పీఎంఈజీపీ సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. 'ఉద్యోగం వెతుక్కోవడం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి' అన్న ప్రధాని మోదీ కలను ఈ పథకం నెరవేరుస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 8.69 లక్షల కొత్త ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు ద్వారా 73.67 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 2008-09 నుంచి 2022-23 వరకు, మొత్తం రూ. 21870.18 కోట్ల నగదు రాయితీని పంపిణీ చేశారు. 80% పైగా ఉత్పత్తి కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటయ్యాయి. వీటిలో 50% పైగా యూనిట్లు ఎస్సీ, ఎస్టీ, మహిళ పారిశ్రామికవేత్తల యాజమాన్యంలో ఏర్పడ్డాయి. ఆకాంక్షిత జిల్లాల్లో 14% పైగా కేంద్రాలను నెలకొల్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 85,167 యూనిట్ల ఏర్పాటు ద్వారా 9.37 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు.

9. 'గ్రామోద్యోగ్ వికాస్ యోజన' నూతన రికార్డు - 'గ్రామ వికాస్ యోజన' కింద, సమాజంలో వెనుకబడిన, అట్టడుగు స్థాయిలో ఉన్న చేతివృత్తి కళాకారుల సంక్షేమం కోసం కేవీఐసీ చాలా కీలక కార్యక్రమాలను అమలు చేస్తోంది. 2017-18 నుంచి ఇప్పటివరకు, ప్రతిష్టాత్మక "హనీ మిషన్" కార్యక్రమం కింద 19,118 మంది లబ్ధిదారులకు 1,89,989 లక్షల తేనెటీగల పెట్టెలు, తేనెటీగల కాలనీలను పంపిణీ చేశారు. దీంతోపాటు, 'కుమ్హార్ సశక్తికరణ్' పథకం ద్వారా ఇప్పటి వరకు 25 వేల మందికి పైగా కుమ్మరులకు ఆధునిక విద్యుత్ కుమ్మరి చక్రాలను పంపిణీ చేశారు.

# బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 3వ జోన్ ఎంవిపి కాలనీ పరిధిలోని టిటిడి కళ్యాణ మండపం నుండి ఉషోదయ జంక్షన్ వరకు రూ.29 లక్షల వ్యయంతో వేస్తున్న బీటీ రోడ్డును స్వయంగా దగ్గరుండి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పనుల పరిశీలనలో భాగంగా నగర మేయర్ బీటీ రోడ్డు నిర్మాణాన్ని దగ్గరుండి నాణ్యత మందంతో పాటు వెడల్పులు సమగ్రంగా ఉండే విధంగా వేయించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న రోడ్లు కాలువల తో పాటు ఇతర అభివృద్ధి నిర్మాణం పనుల నాణ్యతలో రాజీ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంవిపి కాలనీ లోని టిటిడి కళ్యాణ మండపం నుండి ఉషోదయ జంక్షన్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలతో ఉన్నందున స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్న దృశ్య వారి విన్నపం మేరకు సుమారు 600 మీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి 29 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. ఈ పనుల పర్యవేక్షణలో నాణ్యత లో భాగంగా తారు, పిక్క మిక్సింగ్ తోపాటు 40 మిల్లీమీటర్ల మందం కలిగేలా బీటీ రోడ్డు లేయర్ వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో విశాఖ నగరం నుండి పాలన అందిస్తారని, ఆయన సారథ్యంలో విశాఖ నగరం సుందర నగరంగా తీర్చి తిట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహన ఇంజనీర్ శ్రీనివాసరావు, సహాయ ఇంజనీర్ శిరీష, సచివాలయం సెక్రటరీలు, బీటీ రోడ్డు సంబంధించిన కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11న అయోధ్య శ్రీరామ పాదుకలుకు అభిషేకం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీమద్రామాయణ ప్రాంగణం రామనారాయణంలో ఈనెల 11న అయోధ్య శ్రీరామ పాదుకలుకు అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఎన్విఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు . సుమారు 8 కిలోల వెండితో చేసిన అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రుల పాదుకలకు శృంగేరి జగద్గురువులు కొన్ని నెలలపాటు నిత్యపూజలు చేశారని మరియు 108 పుణ్య క్షేత్రాలలో పూజలు చేసిన అనంతరం అయోధ్య శ్రీ సీతారాముల ఆలయమునకు సమర్పించబడతాయని అన్నారు. ఈ సందర్భముగా ఈనెల 11వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీరామనారాయణం పుణ్యక్షేత్రంలో ఆ పవిత్ర శ్రీరామపాదుకలకు అభిషేకం, పూజలు జరుగుతాయని ,అనంతరం భక్తులకు స్పర్శ దర్శనాలు(పాదుకులను తాకే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు .కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకునిరి శ్రీ సీతారామచంద్రుల కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# వైయస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభోత్సవంలో కృష్ణదాస్

## రూ.16కోట్లు విలువైన 52 పరికరాలు అందజేత



**నరసన్నపేట:** వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, ప్రతి రైతుకు వ్యవసాయం అంటే దండగ కాదు పండగ అనేలా ప్రభుత్వం పని చేస్తున్నదని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. నరసన్నపేట వైఎస్ఆర్ జంక్షన్ వద్ద వైయస్సార్ యంత్ర సేవా పథకాన్ని శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభించారు. రూ.16 కోట్ల విలువైన 52 పరికరాలను ఈ సందర్భంగా రైతు గ్రూపు సభ్యులకు అందజేశారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, రైతులకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్ల వంటి వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, రైతులు గత రెండేళ్లుగా వీటి ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని వివరించారు. వీటి ద్వారా కూలీల కొరతకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయిందన్నారు. రాష్ట్రంలోని 10,444 ఆర్బీకేల పరిధిలో రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి, ఈ వ్యవసాయ పరికరాలను తక్కువ ధరకే ఇతర రైతులకు అద్దెకిచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని, గ్రామ స్వరాజ్యం అనే పదానికి నిజమైన నిర్వచనం చెప్పేలా మన ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందనీ కృష్ణ దాస్ వివరించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్, ఎంపీపీలు ఆరంగి మురళీధర్, వాన గోపి, మాజీ జడ్పిటిసి సభ్యులు చింతు రామారావు, ముద్దాడ బైరాగి నాయుడు, స్థానిక సర్పంచ్ బురెల్లి శంకర్, రాజాపు అప్పన్న, కోరాడ చంద్రభూషణ్ గుప్తా, బొబ్బది ఈశ్వరరావు, తంగి మురళీకృష్ణ, పాగోటి రాజారావు, నరసన్నపేట ఏడి రవీంద్ర భారతి, నాలుగు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు హెచ్చరిక

విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సెల్: 8186030813

VASAVI ONLINE SERVICES
"ONE STOP SOLUTIONS FOR ALL ONLINE SERVICES"
" We Also Provide News Paper Advertisements"
PASSPORT ALL OVER INDIA SERVICE | US VISA ALL OVER INDIA SERVICE | PAN CARD ALL OVER INDIA SERVICE
FOOD LICENSE TELANGANA | FIRM&SOCIETY RESGISTRATION | BIRTH CERTIFICATES
DIGITAL SIGNATURE | MUTUAL FUNDS | IMPORT&EXPORT LICENSE
TRAVELS TELANGANA TOURISM | GST REGISTRATION | LABOUR LICENSE Telangana
Email: vos24x7@gmail.com
V.CHAITANYA KUMAR
8019 24 24 24, 9133 84 84 84
HEAD OFFICE: ABIDS, BRANCH OFFICE: SHOP.NO 79 613/B, 6TH FLOOR, BABUKHAN ESTATES, BASHEERBAGH-HYD

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8186030813

HMDA PLOTS
DTCP PLOTS
FARMLAND PLOTS
AVAILABLE
LP & RERA Approved Proj
Spot Registration
Mumbai Highway
Srisailam Highway
Banglore Highway
Vijayawada Highway
Kompally chavalla shankerpally vikarabad Gachibowli Manikonda Kokapet Attapur flats villas open plots Gated community project Bank loan available more details site visit free contact 9948848245




COMFORT KRAFT
INTERIA
One Stop For All Your Home Interior Needs
- Carpenter Work
- False Ceiling
- Wall Painting
- Modular Kitchen
- Cupboards
- Furnishing
- Customized Wallpaper
- Customized Curtains & Blinds
- Sliding Mosquito Mesh with Honey Comb Partition
Customized Service
100% Quality Assurance
Experienced Manufacturing Personals
7569977133
Murad Nagar, Mehdipatnam

జై శ్రీమన్నారాయణ | శ్రీమతే రామానుజాయ నమః
శ్రీ వైష్ణవ సంప్రదాయ సమాచార ప్రచార కేంద్రం Ph: 9246673421
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి ఆశ్రమం, దివ్య సాకేతం,
భాగ్య నగరం లో ఉపనయనములు, సమాశ్రయణములు జరుగుతున్నవి.
సామూహిక ఉపనయములు: తేది: జూన్ 08, 2023:
సమాశ్రయణములు : తేది: జూన్ 11, 2023:
వేదిక: దివ్య సాకేతం, ముచ్చింతల్, భాగ్య నగరం. వివరాలకు: ఫో: 7382046888, 7901422022
సదా భగవత్ భాగవత ఆచార్య సేవలో...
శ్రీ వైష్ణవ సంప్రదాయ సమాచార, ప్రచార కేంద్రం
Sri Vaishnava Services Info Centre
Visakhapatnam
Phone 9246674585
Whatsapp 9246673421

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8186030813.